ముత్యాల ముగ్గు మురిసింది. సంక్రాంతి పండుగను వారం రోజుల ముందే అతివలు తమ రంగవల్లులతో స్వాగతం పలికారు. ఏబీఎన్- ఆంధ్రజ్యోతి నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన సౌజన్యంతో లోకల్ స్పాన్సర్ల సహకారంతో తిరుపతి, చిత్తూరు, మదనపల్లెలో ఆదివారం ముగ్గుల పోటీలు జరిగాయి. మొత్తం 239 మంది మహిళలు హాజరై ఉత్సాహంగా ముగ్గులేశారు.





జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్న ముగ్గు విజేత ఎం.విద్య (తిరుపతి)

తిరుపతిలో...





రెండో బహుమతి తీసుకుంటున్న కె.లోకేశ్వరి





మూడో బహుమతి అందుకుంటున్న సీహెచ్ అనురాధ

● మహిళల కళాసృజనకు పట్టం గట్టిన ఏబీఎన్- ఆంధ్రజ్యోతి

మురిసిన ముత్యాల ముగ్గు



మదనపల్లెలో జరిగిన పోటీల్లో ఉత్సాహంగా ముగ్గులు వేస్తున్న మహిళలు

● తిరుపతి, చిత్తూరు, మదనపల్లెల్లో విరిసిన రంగవల్లులు

● వారం ముందే సంక్రాంతి సందడి

ఆంధ్రజ్యోతి, తిరుపతి: తిరుపతిలోని ఇందిరా మైదానంలో జరిగిన ముగ్గుల పోటీల్లో 87 మంది పాల్గొన్నారు. ఈ పోటీలకు సైకం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ వెంకటరమణారెడ్డి హాజరవగా, న్యానిర్ణేతలుగా శ్రీపద్మావతి మహిళా వర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డి.యువశ్రీ, ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ బి.తేజోవాణి వ్యవహరించారు. ఎం.విద్య (కొర్లగుంట), కె.లోకేశ్వరి (భవాని నగర్), సీహెచ్ అనూరాధ (సత్యనారాయణపురం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి ముఖ్యఅతిథితో పాటు సైకం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సైకం జయచంద్రారెడ్డి, న్యాయనిర్ణేతలు బహుమతులను అందజేశారు. అదేవిధంగా ఐదుగురికి కన్సొలేషన్ బహుమతులను బాలాజీ మొబైల్స్ అధినేత, బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి వాచీలు అందజేశారు. పాల్గొన్న ప్రతిఒక్కరికీ శుభమస్తు అసిస్టెంట్ మేనేజర్ వెంకటేష్, టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్ రెడ్డి, రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గూండాల గోపీనాథరెడ్డి ప్రత్యేక కానుకలు అందజేశారు.

చిత్తూరు: చిత్తూరులోని ఎన్‌పీసీ పెవిలియన్ కల్యాణమండపంల జరిగిన ముగ్గుల పోటీల్లో 76 మంది పాల్గొన్నారు. లోకల్ స్పాన్సర్‌గా విజయం విద్యాసంస్థలు వ్యవహరించాయి. కార్పొరేషన్ కమిషనర్ అరుణ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, విజయం విద్యాసంస్థల డైరెక్టర్ శైలజ, సావిత్రమ్మ డిగ్రీ కాలేజ్ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ జి.ఉషారాణి, పీఎస్ఎన్ వివేకానంద జూనియర్ కాలేజ్ అధ్యాపకురాలు మమత న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను డి.బుజ్జిరావు (లక్ష్మీనగర్ కాలనీ), వి.పొన్నియమ్మ (ఎంజీఆర్‌వీధి), ఎ.రాణి (శంకరయ్యగుంట) వరుసగా అందుకున్నారు. వీరికి ముఖ్య అతిథితో పాటు న్యాయ నిర్ణేతలు బహుమతులను ప్రదానం చేశారు.

మదనపల్లె: మదనపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ముగ్గుల పోటీలకు 76 మంది మహిళలు, యువతులు పాల్గొన్నారు. ఈ పోటీలకు శ్రీనివాస డిగ్రీ కాలేజ్, శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరించారు. డి.వి.పూర్ణ, ఎస్.పద్మ, బి.మల్లిక వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. వీరికి ముఖ్య అతిథి, మదనపల్లె ఆర్డీవో ఎం.ఎస్.మురళి, శ్రీనివాసడిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎన్.శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుబ్బారెడ్డి, న్యాయనిర్ణేతలు మోహన్‌వల్లి, ఉషారాణి బహుమతులు అందజేశారు.

చిత్తూరులో...





మొదటి బహుమతి అందుకుంటున్న బుజ్జిరావు





రెండో బహుమతి తీసుకుంటున్న పొన్నియమ్మ





మూడో బహుమతి అందుకుంటున్న రాణి

మదనపల్లెలో...





మొదటి బహుమతి అందుకుంటున్న డి.వి.పూర్ణ





రెండో బహుమతి తీసుకుంటున్న ఎస్.పద్మ





తృతీయ బహుమతి అందుకుంటున్న బి.మల్లిక

బాహుదాలో ఇసుక అక్రమ తవ్వకాలు

● ఎక్స్‌కవేటర్లతో యథేచ్ఛగా ...

● టిప్పర్ల ద్వారా రాత్రిళ్లు రవాణా

కలికిరి, జనవరి 7: మండలంలోని బాహుదా నదిలో మళ్లీ ఇసుక అక్రమ తవ్వకాలు జోరందుకున్నాయి. బాహుదా నది పరీవాహక ప్రాంతాలైన పారపట్ల, చీకటిపల్లె, పల్లవోలు, గుండ్లూరు, మహల్, అద్దవారిపల్లె పంచాయతీల్లో ఎక్స్‌కవేటర్లతో ఇసుక తవ్వుతూ టిప్పర్ల ద్వారా తరలించడం పరిపాటిగా మారింది. గతంలో రీచ్‌లను నిర్వహిస్తున్న జేపీ సంస్థ తప్పుకోవడంతో తాజాగా ఎస్సార్ కంపెనీకి ఇసుక తవ్వకాలను ప్రభుత్వం కట్టబెట్టింది. ఎస్సార్ సంస్థ ఉద్యోగులు రీచ్‌లను పరిశీలించి తవ్వకాలు ఎలా జరపాలన్న దానిపై అంచనాలు వేసుకుంటోంది. ఈ దశలో పది రోజుల క్రితం బాహుదా నుంచి మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్న వారందరినీ వాల్మీకిపురం రప్పించి అక్కడ సీఐ సురేష్‌కుమార్ సమావేశం ఏర్పాటు చేశారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేస్తామని, అధికారికంగా తవ్వకాలు మొదలైన తరువాత బిల్లులు వేయించుకుని నిబంధనలకు అనుగుణంగా రవాణా చేసుకోవచ్చని హెచ్చరించి పంపారు. నాలుగైదు రోజులు తాత్కాలికంగా తవ్వకాలతో పాటు రవాణా కూడా నిలిచిపోయాయి. రెండు రోజుల క్రితం ఎస్సార్ కంపెనీ ఉద్యోగులు తవ్వకాలకు సమాయత్తం కావడంతో అధికార పార్టీకి చెందిన స్థానికులు అభ్యంతరం చెప్పారు. ప్రభుత్వం నుంచి కాంట్రాక్టు పొందినా తవ్వకాలు జరపడానికి అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఈ సమాచారం అమరావతికి చేరడంతో ఉన్నత స్థాయి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు రీచ్‌ల దగ్గరకెళ్లి కాంట్రాక్టు పొందిన ఎస్సార్ కంపెనీని అడ్డుకోవడానికి వీలు లేదని, అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడుకొమ్మని చెప్పారు. ఆ తరువాత ఏమి జరిగిందోగానీ శనివారం నుంచి బాహుదా నదిలో అక్రమ తవ్వకాలు మొదలయ్యాయి. పెద్ద సంఖ్యలో టిప్పర్ల ద్వారా రాత్రి వేళల్లో ఇసుక తరలిస్తున్నారు. పగటి పూట ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరిపి నిల్వ చేసిన ఇసుక డంప్‌లను చీకటిపడ్డ తరువాత పెద్ద పెద్ద టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఆదివారం కూడా బాహుదాలో పగటి పూట ఇసుక తవ్వకాలు జరిగాయి. దీనిని రాత్రివేళల్లో టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారని స్థానికులు కూడా చెప్పారు. ఇలా తరలిస్తున్న వారంతా అధికార పార్టీకి చెందిన వారు కావడంతో పోలీసులు పట్టించుకోవడం లేదని కూడా చెబుతున్నారు. ఈ సందర్భంగా సీఐ సురేష్‌కుమార్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తవ్వుతున్న వారికి ఇది వరకే హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఎస్సార్ కంపెనీకి చెందిన ఉద్యోగులు కూడా తవ్వకాల కోసం సిద్ధమవుతున్నారని, ఎవరైనా ప్రభుత్వ నిబంధనల మేరకు బిల్లులు వేయించుకుని రవాణా చేస్తేనే అనుమతిస్తామని ఆయన స్పష్టం చేశారు. బాహుదా నది వెంబడి రాత్రి పూట గస్తీ కూడా ఏర్పాటు చేస్తామని సీఐ చెప్పారు.



మహల్ సమీపంలోని బాహుదా నదిలో ఆదివారం ఇసుక తోడుతున్న ఎక్స్‌కవేటర్


వైభవంగా సంజీవరాయునికి పొంగళ్లు

● పొంగుబాళ్లు పెట్టిన పురుషులు

పుల్లంపేట, జనవరి 7: మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో వెలసిన సంజీవరాయునికి పొంగుబాళ్ల కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏడాది సంక్రాంతి పర్వదినం ముందు వచ్చే ఆదివారం గ్రామస్థులు సంజీవరాయునికి పొంగుబాళ్ల పెడుతూ మొక్కులు తీర్చుకుంటూ వస్తున్నారు. తెల్లవారు జాము నుంచి పురుషులు పొంగుబాళ్ల పెట్టేందుకు కావాల్సిన వస్తువులను బుట్టలలో తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ఆలయంలో పురుషులు పొంగుబాళ్లు పెట్టారు. అనంతరం స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. నైవేద్యం సమర్పించిన తరువాత స్వామి వారికి 101 బిందెలతో అభిషేకం నిర్వహించారు.



పొంగళ్లు వండుతున్న పురుషులు



ఆలయం లేని సంజీవరాయుడు

ఇక్కడ సంజీవరాయునికి ఆలయం, గర్భగుడి అంటూ ఏమీ లేదు. ఓ రాతిబండపై చెక్కిన బీజాక్షరాలే ఇక్కడ సంజీవరాయునిగా పూజలందుకుంటున్నారు. ఈయనకు గర్భగుడి ఆలయం కానీ ఏమీ లేదు. చు ట్టూ ప్రహరీ మాత్రం ఉంది. పొంగుబాళ్ల సందర్భంగా స్వా మివారికి చిన్న మండపాన్ని ఏర్పాటు చేసి అలంకరించారు.

ఆడవారికి లేని ఆలయ ప్రవేశం

సంజీవరాయుని ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ పురుషులు మాత్రమే పొంగళ్లు పెడతారు. సాధారణంగా అమ్మవారికి మహిళలు పొంగుబాళ్లు పెడితే ఇక్కడ సంజీవరాయునికి మగవారే పొంగుబాళ్లు పెడుతూ నైవేద్యం సమర్పిస్తారు. ఆ నైవేద్యాన్ని కూడా మహిళలు ముట్టుకోరు. కేవలం పురుషులు మాత్రమే ప్రసాదంగా తీసుకుంటారు. ఇకపోతే ఆలయంలోకి మహిళలకు ప్రవేశం లేదు. పది సంవత్సరాల చిన్నారులు మాత్రమే స్వామిని దర్శించుకుంటారు. మిగిలినవాళ్లు గేటు బయట ఉండే స్వామివారిని దర్శించుకుంటారు. గేటు బయటనుండే మహిళలు హారతి తీసుకుంటారు.

దేశ విదేశాల నుంచి...

తిప్పాయపల్లె గ్రామస్థులు దేశ, విదేశాల్లో, బయటప్రాంతాల్లో ఎక్కడవున్నా సంజీవరాయుని పొంగుబాళ్ల కార్యక్రమానికి స్వగ్రామానికి చేరుకుంటారు. ఇక్కడ స్వామి వారికి పొంగుబాళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. అనాదిగా వస్తున్న ఆచారాన్ని ఇక్కడ పురుషులు తూచా త ప్పకుండా పాటిస్తున్నారు. మగవాళ్లు సంజీవరాయునికి పొం గుబాళ్లు పెట్టడం వల్ల తమ గ్రామం సుభిక్షంగా ఉంటుందని, కోర్కెలు నెరవేరుతాయని, పంటలు పండుతాయని, గ్రామంలోకి దుష్టశక్తులు రాకుండా ఉంటాయని వీరి నమ్మకం.

సంక్రాంతి కంటే పొంగుబాళ్లకే ప్రాధాన్యత

తిప్పాయపల్లె గ్రామస్థులు సంక్రాంతి పర్వదినం కంటే సంజీవరాయునికి పొంగుబాళ్లు పెట్టడానికే ప్రాధాన్యత ఇస్తారు. ఈ పండుగను గ్రామస్థులు పెద్ద పండుగగా జరుపుకుంటారు. సంజీవరాయుని పొంగళ్లకు గ్రామస్థులు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి పండుగను ఘనంగా జరుపుకుంటారు. స్వామి వారికి కానుకలుగా బెల్లం, కొబ్బరి సమర్పిస్తారు.



ఆలయం వెలుపల నుంచే స్వామివారిని దర్శించుకుంటున్న మహిళలు


సుండుపల్లె: జీవో నెంబర్-2 కాపీలను దహనం చేస్తున్న అంగన్వాడీలు


రాజంపేటలో..


చిట్వేలిలో..


రైల్వేకోడూరు: నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కొత్త చట్టాలను ప్రయోగిస్తే.. కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకుంటాం

సుండుపల్లె, జనవరి7: ప్రభుత్వం కొత్త చట్టాలను ప్రయోగిస్తే తాము కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకుంటామని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. సుండుపల్లె మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలు జీవో నెంబర్ 2 కాపీలకు నిప్పంటించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విశ్వనాథ్ నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా కార్మికులపై జీవో నెంబర్ 2ను ప్రయోగించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు ఎస్టీయూ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఏఐటీయూసీ నాయకురాలు నాగేశ్వరి, సుజాత, ఎస్టీయూ నేత ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా చట్టం నిరసన వ్యక్తం చేస్తూ ఆ జీవో కాపీలను దగ్ధం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా గుప్పించిన హామీలు అమలు చేయకపోగా, బలవంతంగా ఆందోళన విరమింపజేసేందుకు జీవో జారీ చేయడం దారుణమన్నారు. అంగన్‌వాడీ నాయకురాలు విజయ, అమరావతి, శివరంజని, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకు పోరాటాలు ఆగవని ప్రాజెక్టు అధ్యక్షురాలు రమాదేవి తెలిపారు. రైల్వేకోడూరు అంగన్వాడీ నాయకురాళ్లు పద్మ, లీలా, శిరీషా, దుర్గా, రాధ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : చిట్వేలి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు అధ్యక్షతన ఎస్మా జీవో కాపీలను తగలబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవోల పేరుతో భయపెట్టే ధోరణి మానుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పందికాల మణి, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు యదురూరి సుజాత, పగడాల సుధామణి, బండారు శిరీష, సుజన, శ్రీదేవి, రాధ, సులోచన, సీఐటీయూ మండల అధ్యక్షుడు కొతత నాని, ఆయాలు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: ఎస్మా ప్రయోగం అప్రజాస్వామికమని జనవిజ్ఞాన వేదిక, పౌరహక్కుల సంఘాల నేతలు హరిశర్మ, ప్రతాప్‌రెడ్డి, రవిశంకర్, రెడ్డెయ్య, లంబాడీ హక్కుల సంఘం జాతీయ నాయకుడు శంకర్‌నాయక్, ఎస్ఎస్ఏ ఉద్యోగులు రమణ, మహమ్మద్‌అలీ తదితరులు విమర్శించారు అంగన్వాడీల రిలే నిరాహార దీక్షకు వారు ఆదివారం సంఘీభావం తెలిపారు. దోపిడీ చేసే వారికి అండ లాలు, కార్పొరేట్లకు రాయితీలు, రుణమాఫీలు చేయడంతోపాటు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కీం వర్కర్ల శ్రమను దోచుకునే వైనాన్ని ఎండగట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఓబులమ్మ, భూకైలేశ్వరి, లక్ష్మీదేవమ్మ ఉమాదేవి, విజయమ్మ, మస్రూన్‌బీ, నందిని తదితరులు పాల్గొన్నారు.


రాయచోటి: మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం జిల్లా నేత రవిశంకర్

గంగమ్మకు ఘనంగా పూజలు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 7: మండలంలోని అనంతపురం గ్రామంలో గంగమ్మకు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మ జాతర సమీపిస్తుండడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించారు. జాతర ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది.

గంగమ్మకు ముఖ కవచం సమర్పణ

సంబేపల్లె, జనవరి7: దేవరరాయి నల్లగంగమ్మకు ఆదివారం కడప పట్టణం చిన్నచౌకు రెడ్డీస్‌కాలనీకి చెందిన రాధాకృష్ణ కుమారుడు మనోజ్ నాగపడిగెలతో కూడిన వెండి ముఖం కవచం, కిరీటాన్ని సమర్పించారు. ఈ ఆలయ ఈవో కొండారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరసింహస్వామి ఆలయానికి భూమిపూజ

చిన్నమండెం, జనవరి 7: మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని మండెం లక్ష్మి నరసింహస్వామి ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. రూ. 1.25 కోట్ల నిధులతో ఆలయ పునర్నిర్మాణానికి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పురాతన ఆలయాన్ని తొలగించి, అదే స్థానంలో మునుపటి ఆకారంతోనే నూతన ఆలయాన్ని నిర్మించేందుకు ఆదివారం పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ డీఈ గంగయ్య, ఈవో కొండారెడ్డి, సర్పంచ్, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభల్లో గంగనపల్లి వెంకటరమణ

నందలూరు, జనవరి7 : తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో మండలంలోని నాగిరెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమ్మేళనంలో పద్యకవితలతో పాటు, తెలుగు వెలుగుకు ప్రజాచైతన్యమే ముఖ్యం అన్న కథను వినిపించానన్నారు. శతావధాని డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఎస్.కొల్లూరి రాజేష్, బొల్లు రామ్మోహన్ తదితరుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, పతకం అందుకున్నట్లు వెంకటరమణ తెలిపారు.

'మానవత' చేయూత

చిట్వేలి, జనవరి 7: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిట్వేలికి చెందిన ఆవుల జయమ్మతోపాటు, మరో వ్యక్తి ఈ సాయం అందుకున్నారు. సంస్థ అధ్యక్షుడు సాయిరాం, కార్యదర్శి మునిరావు, మానవత గౌరవ డైరెక్టర్ బోర్డు సలహా దారులు విశ్వనాథం, శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి వీరాంజనరాజు, ఉపాధ్యక్షుడు వెంకట రెడ్డి, రోళ్లమోహన్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి

రాయచోటిటౌన్, జనవరి 7: పాదయాత్రలోనూ, అసెంబ్లీలోనూ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీ. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా ఆదివారం 13వ రోజు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని అంబేద్కర్ చిత్రపటం వద్ద మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో విసిగిపోయిన కార్మికులు సమ్మె బాట పట్టాల్సి వచ్చిందన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిద్దయ్య, పెద్దమంగమ్మ, తిరుపతమ్మ, ఆంజనేయులు, రవికుమార్, వెంకట్రమణ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: రాజంపేటలో కొనసాగిస్తున్న మున్సిపల్ కార్మికుల సమ్మె ఆదివారంతో మూడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు సీహెచ్ ఓబయ్య, ప్రసాద్, లక్ష్మీదేవి, రవిశంకర్, ప్రమీల ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కరుణించేలా దేవుడా మమ్మల్ని కాపాడు అంటూ ప్రాధేయపడుతూ చేతులు జోడించి నిరసనలు తెలిపారు.


రాయచోటి: ధర్నా చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు


రాజంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

'సమగ్ర శిక్ష ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు' అన్యాయం

రాయచోటి, జనవరి 7: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయడమే కాకుండా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపారు.

రాయచోటిటౌన్: సమగ్ర శిక్ష ఉద్యో గులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెంటనే ఉప సంహరించుకోవాలని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ డీఈవోను డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోగా బెదిరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. మూడు నెలలుగా కనీసం జీ తాలు కూడా చెల్లించకుండా వారితో వెట్టి చాకిరి చేయించుకోవడం దారుణమన్నారు. సకాలంలో జీతాలు చెల్లింపునకు బడ్జెట్ కేటాయించాలని, సమాన పనికి సమాన వేతనం, హెచ్ఆర్ పాలసీ అమలు, ఉద్యోగ భద్రత, పెన్షన్ సౌకర్యం కల్పించాలని వారు చేస్తున్న సమ్మె న్యాయబద్ధ మైనదన్నారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు అక్రమ్‌బాషా, వెంకటసుబ్బయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు విశ్వనాథరెడ్డి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.


నిరసన కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

అధికారమే లక్ష్యంగా పనిచేస్తాం..

ఓబులవారిపల్లె, జనవరి7 : స్వచ్ఛంద సంస్థ ద్వారా నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవలు చేస్తున్న ముక్కా రూపానందరెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరనుండడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన రూపానందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికలలో వైసీపీ గెలుపునకు కృషి చేసినా తగిన గుర్తింపు లభించకపోవడం, స్థానిక నాయకుల రాజకీయాలు నచ్చక ఆ పార్టీకి దూరమయ్యానన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రైల్వేకోడూరులో టీడీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. పంతగాని నరసింహప్రసాద్ మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాలను పాటిస్తూ టీడీపీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి, టీడీపీ నాయకులు లారీ సుబ్బరాయుడు, సూర్యప్రకాష్ నాయుడు, బీసీఆర్ మస్తాన్, కూని చంద్రయ్య, గజేంద్ర నాయుడు, ముస్లిం, దళిత నాయకులు, జనసేన అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కస్తూరిని కలసిన ముక్కా

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడును ఆదివారం ప్రముఖ పారిశ్రామికవేత్త ముక్కా రూపానందరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మొదట కస్తూరి విశ్వనాథనాయుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, సీనియర్ టీడీపీ నాయకుడు కల్లా చలపతి స్వాగతం పలికారు. పలు విషయాలు సుదీర్ఘంగా చర్చించుకున్నారు. సీనియర్ టీడీపీ నేత కట్టా నారాయణయ్య నాయుడు తనయుడు కట్టా బాలాజీ ఆహ్వానం మేరకు ముక్కా రూపానందరెడ్డి ఆయనను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల టీడీపీ, జనసేన నాయకులు, వైసీపీ అసంతృప్త నేత కె. నాగమణి తదితరులు పాల్గొన్నారు.


కస్తూరితో చర్చిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

అరాచక వైసీపీని పారద్రోలండి: చమర్తి

సిద్దవటం, జనవరి7 : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండల కేంద్రంలోని దిగువపేట గాంధీ వీధిలో క్రికెట్ టోర్నమెంటును రాజంపేట పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రికెట్ టోర్నమెంటు నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. రాబోవు ఎన్నికల్లో యువత ఓటు అనే ఆయుధంతో అరాచక వైసీపీని పారద్రోలాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేష్‌నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు జ్యోతి మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, దశరథనాయుడు, నాగమునిరెడ్డి, శ్రీనివాసులునాయుడు, పిచ్చిరెడ్డి, రాజనాయుడు, చలమయ్య, లక్ష్మయ్య, గాలి సుబ్బయ్య, పార్ల శ్రీనివాసులు యాదవ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

యువత క్రీడల్లో పాల్గొనాలి

సంబేపల్లె, జనవరి7: గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో పాల్గొనాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లెలో యువత నిర్వహించిన టీడీపీ టీ 10 క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవంలో వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందని తెలియజేశారు. గ్రామీణ ప్రాంత యువత ప్రతిభను చాటుకునే అవకాశం ఉంటుందన్నారు. క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసిన పెద్దజంగంపల్లి గ్రామస్తులను అభినందించారు. అనంతరం రాయచోటి మాధవరం ఊరుగాయగుట్టపల్లెకు చెందిన క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ ఎగురవేసి, బ్యాటింగ్ చేసి టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదిరెడ్డి రమేశ్‌రెడ్డి, దుద్యాల గ్రామ సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి, మాజీసర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, సాధుజయచంద్రారెడ్డి, సహదేవ, శివప్రసాద్, రమణయ్య, చిన్నప్ప, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


టాస్‌వేసి క్రికెట్ లీగ్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

జనసేన పార్టీని గెలిపించండి

సిద్దవటం, జనవరి7 : జనసేన పార్టీని గెలిపించాలంటూ ఆ పార్టీ నాయకుడు అతికారి కృష్ణ ఆదివారం సిద్దవటం ఎస్.రాజంపేట తదితర గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేసేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు అభిమానులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశంపార్టీతో పొత్తులు పెట్టుకొని కలిసిముందుకు వెళుతున్నామని వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. జనసేన పార్టీ అధికారంలోకి వస్తే బడుగు బలహీన వర్గాలకు మేలు చేకూరుతుందని ప్రతి పేదవాడికి కడుపునిండా అన్నం దొరుకుతుందన్నారు. అనంతరం కార్యకర్తలతో పార్టీ అభిమానులతో చర్చించారు. టీడీపీ నాయకుడు కుప్పాల వెంకటసుబ్బయ్య, సిద్దవటం గ్రామ సర్పంచ్ ప్రతినిధి ఓబులయ్య, బాబీ, పార్టీ కార్యకర్తల అభిమానులు పాల్గొన్నారు.

జీవితంలో ఉన్నత శిఖరాలకు టెన్త్ మార్కులే పునాది

పెనగలూరు, జనవరి7 : జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనుకొనే విద్యార్థులకు టెన్త్‌మార్కులు పునాదిలాంటివని రాజంపేట ఏఎస్‌డబ్ల్యూవో జి.ప్రేమసాగర్ సూచించారు. ఆదివారం సాయంత్రం పెనగలూరు ఎస్సీ హాస్టల్‌లో హెచ్‌డబ్ల్యూవో హరిప్రసాద్ అధ్యక్షతన పదవ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ పరీక్షలకు ఇక 72 రోజులు మాత్రమే సమయముందన్నారు. పట్టుదలతో చదువుకొంటే మంచిమార్కులతో గట్టెక్క వచ్చునన్నారు.

అన్నదానం

రామాపురం, జనవరి 7: డీవీ రమణయ్య 23వ వర్ధంతి సందర్భంగా ప్రేమాలయం ఆశ్రమంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ ఆధ్వర్యంలో అన్నదానం చేసినట్లు లయన్ హరినాధ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత రాజేశ్వరి, కుమారుడు వంశీకృష్ణ, కోడలు భారతి, మనమరాలు దేవికృతిక, మనమడు వెంకటకృష్ణసాయి పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపకపోతే భవిష్యత్తు ఉండదు


కరపత్రాలను పంపిణీ చేస్తున్న గన్నె సుబ్బనరసయ్యనాయుడు

రాజంపేట టౌన్, జనవరి 7: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి పంపకపోతే రాష్ట్రానికి భవిష్యత్తు ఉండదని రాజంపేట మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు తెలిపారు. ఆదివారం రాజంపేట మండలం కటారుపల్లెలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని అందుకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. వరదయ్యగారిపల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడు కె.సతీష్, మంచాల జయరామనాయుడు ఆధ్వర్యంలో మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె కరీం, సాంబశివయ్యనాయుడు ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే సంక్షేమ పథకాలను కరపత్రాల రూపేణా అందజేశారు. ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వ అరాచకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని సాగనంపి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును అధికారంలోకి తీసుకువస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

ఒంటిమిట్ట : వైసీపీ అరాచకపాలనకు చరమగీతం పాడాలని మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో భవిష్యత్తు కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంట్రాక్టర్ ఎస్.వి.రమణ, పత్తి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు సజ్జలకు లేదు

రైల్వేకోడూరు, జనవరి 7: కాంగ్రెస్ పార్టీ ని విమర్శించే హక్కు సజ్జల రామకృష్ణా రెడ్డికి లేదని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాజబోయిన శ్రీకాంత్ తెలిపా రు. ఆదివారం రైల్వేకోడూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డుతూ ప్రజా వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి మరోసారి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణాన్ని తన రాజకీయ అవసరం కోసం వాడుకోవాలని చూస్తున్నా రన్నారు. గతంలో రిలయన్స్ కంపెనీ అధినేత అనిల్‌అంబానీ కారణమని చెప్పి తన పార్టీ కార్యకర్తలతో ఆయన కంపెనీకి సంబంధించిన సెల్ ఫోన్ టవర్లు, ఆస్తులపై దాడులు చేయించారని గుర్తు చేశారు. ఆఖరికి సౌమ్యుడైన తన చిన్నాన్న వివేకానందరెడ్డిని తన ఇంటి వారే అత్యంత కిరాతకంగా చంపి దానిని ప్రతిపక్షాల పైకి నెట్టి రాజకీయంగా వాడుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా సజ్జల రామకృష్ణారెడ్డి నోరు అదుపులో ఉంచుకోవాలని తెలిపారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ ఊరుకోదని హెచ్చరించారు.

ఏపీజీబీ ఆధ్వర్యంలో రోడ్ షో

రైల్వేకోడూరు, జనవరి 7: ఏపీజీబీ - 2 ఆధ్వర్యంలో కుబేర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆదివారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీబీ జీఎం సంజీవప్ప, ఆర్ఎం సుశాంత్‌స్వరాజ్ మాట్లాడుతూ తమ బ్యాంకు ఖాతాదారులకు మంచి సేవలు అందిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు, మేనేజర్లు వాసు, శాంతారాజ్, ఝాన్సీరాణి, బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

కలిబండ, పడమటికోనల్లో 'వికసిత్ భారత్'

చిన్నమండెం, జనవరి7: మండలంలోని కలిబండ, పడమటికోన గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 17 రకాల పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రోన్ల సాయంతో పొలాలకు మందు పిచికారీ చేసే విధానాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దివ్య, ఏవో గీత, హౌసింగ్ ఏఈ రాజేశ్వరి, మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


వికసిత్‌భారత్ సంకల్ప యాత్రలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

తైక్వాండో పోటీల్లో విద్యార్థినికి రజత పతకం

రైల్వేకోడూరు, జనవరి 7: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో రైల్వేకోడూరు విద్యార్థిని రజత పతకం సాధించింది. ఆదివారం రైల్వేకోడూరు ఆర్ఎస్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకుడు హస్తి రవిశంకర్‌రాజు మాట్లాడుతూ గత డిసెంబరు 30 నుంచి ఈ నెల 5 వరకు మధ్యప్రదేశ్‌లోని బెతుల్ ప్రాంతంలో 67వ జాతీయ తైక్వాండో స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టీమ్ 3 కాంస్య, ఒక రజత పతకం సాధించగా, రజత పతకాన్ని రైల్వేకోడూరుకు చెందిన హస్తి తేజస్విని దక్కించుకుందని తెలిపారు. ఆమెకు రూ. 20 వేలు పోత్సాహక బహుమతి ఇచ్చినట్లు తెలిపారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి సి. శారద తేజస్వినికి స్పోర్ట్స్ కిట్ ప్రకటించారని వివరించారు.

అయోధ్య శ్రీ రాముడి శోభాయాత్రకు నీరాజనాలు

నందలూరు, జనవరి7 : అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం నిర్వహించిన శోభయాత్రకు భక్తులు నీరాజనాలు పలికారు. నాగిరెడ్డిపల్లె ఎర్రచెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి డీసీఎం రోడ్డు, అరవపల్లె మీదుగా సౌమ్యనాథస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా గోపూజ చేశారు. యాత్రలో పాల్గొన్న భక్తులకు సౌమ్యనాథస్వామి ఆలయం వద్ద అన్నదానం చేశారు. నేతలు మేడా విజయశేఖర్‌రెడ్డి, సాయిలోకేష్, నాగోతు రమేష్ నాయుడు, యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, ఆకుల చలపతి, మోడపోతుల రాము, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్య అక్షింతలు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 7: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఆదివారం ఉపాధ్యాయుడు ఇంటింటికి అందజేశారు. న్యాయవాది ఎంఎల్ రామచంద్రారెడ్డి, విద్యార్థులు ఉమామహేశ్వరనాయక్, భార్గవ్‌నాయక్, ఈశ్వర్, సాంబశివ, గంగాధర పాల్గొన్నారు

పది విద్యార్థులకు ఏకాగ్రత అవసరం

రైల్వేకోడూరు, జనవరి 7: పదోవతరగతి విద్యార్థులకు ఏకాగ్రత అవసరమని మండల విద్యాశాఖ అధికారి-2 సుందర్‌బాబు, ప్రముఖ మోటివేటర్ బాబు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రైవేటు పాఠశాలలో పది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది పరీక్షలు విద్యార్థులకు కీలకంగా ఉంటాయన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులకు ప్రోత్సాహం, సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహరెడ్డి, రామకృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చెకుముకి ట్యాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ

ఓబులవారిపల్లె, జనవరి7: జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల్లో ఏపీఎండీసీ మంగంపేట పబ్లిక్ స్కూల్ 8వ తరగతి విద్యార్థిని రెండవ బహుమతి సాధించింది. రాయచోటిలో కేంద్రంలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంద్రఖ్యాతి భవాని ఈ ఘనత సాధించింది.

కురబ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

రాయచోటి(కలెక్టరేట్), జనవరి7: కురబ సంఘం జిల్లాఅధ్యక్షుడు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అబి కల్యాణ మండపంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురబ సంఘం నాయకులంతా ఒక తాటిపైన ఉండాలని ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఒకరికి ఒకరు సహాయం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆర్థికంగానూ, రాజకీయంగానూ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గౌనిపల్లె శివ, రెడ్డిప్రసాద్, నాగరాజ, రమణ, చెన్నకేశవులు పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగాలపై ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సర్వే

పెనగలూరు, జనవరి7 : ఎస్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పెనగలూరు ఆదర్శ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఈటిమాపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి విద్య, ఉద్యోగాలపై సర్వే చేశారు. ఒక కుటుంబంలో ఎంత మంది చదువుకుంటున్నారన్నారు. డిగ్రీ పూర్తి చేసిన వారెంతమంది, ప్రస్తుతం ఎంతమంది ఉద్యోగం చేస్తున్నారు, ప్రభుత్వ ఉద్యోగాలా.. ప్రైవేటు ఉద్యోగాలా అన్న విషయం రికార్డు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ హేమలత, కృష్ణవేణి, ఆదర్శ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సహజ బ్లెస్సీ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం డాక్యుమెంట్లు రద్దు

రామాపురం, జనవరి 7: రామాపురం మండలం గువ్వలచెరువు గ్రామం సర్వే. నెం.97లోని 61 సెంట్ల శ్మశాన భూమిని ఆ గ్రామ సర్పంచ్ భర్త శివయ్య, ఆయన సోదరులు అక్రమంగా రిజిష్టర్ చేయించుకున్నారంటే శనివారం గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న శివయ్య తన సోదరులతో కలిసి లక్కిరెడ్డిపల్లె రిజిష్టర్ కార్యాలయం చేరుకుని స్థలానికి సంబంధించిన ఎల్పీ నెంబర్ తప్పు పడడంతో తమ పేరు మీద ఉన్న రిజిస్టర్ డాక్యుమెంట్‌ను రద్దు చేసుకున్నారు. ఆదివారం రామాపురంలో వారు విలేఖరులతో మాట్లాడుతూ సర్వేనెం.97లో 2.50 ఎకరాల భూమి ఉండగా రెడ్డివారిపల్లెకు చెందిన మదరాసు పట్టాభిరామయ్య 1943లో మకాన్ నన్నే మియా, అబ్దుల్ రెహ్మాన్, ఫతే అహ్మద్ తదితరులకు 61 సెంట్లు భూమి రిజిస్టర్ చేయించారన్నారు. ఈ సర్వే నెంబర్లలో షేక్ నూర్‌బానుకు ఒక ఎకరా, శ్మశానానికి 61 సెంట్లు పోను మిగిలిన 89 సెంట్లు భూమి మిగిలిందని, అందులో 61 సెంట్లు మాత్ర మే తాము రిజిస్టర్ చేసుకున్నామని తెలిపారు. ఇంకా 28 సెంట్లు మిగులు భూమి ఉందని, ఈ విషయాన్ని గ్రామస్తులు గమనించక తమపై తప్పుడు ఆరోపణలు చేశార న్నారు. వీటన్నింటికీ రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమన్నారు. వారు ఎల్పీ నెంబర్లు సక్రమంగా వేసి ఉంటే ఇలాంటి తప్పులు జరిగి ఉండేవి కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

మురిసిన ముత్యాల ముగ్గులు

ఉత్సాహంగా సాగిన పోటీలు ● సంప్రదాయాలకు నెలవు ● పోటీలకు విశేష స్పందన



కడపలో ముగ్గులు పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు







కడపలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్‌మేనేజర్ అబ్బిగారి నరసయ్య నుంచి రెండో బహుమతి అందుకుంటున్న రమాదేవి - రాయచోటిలో రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి నుంచి రెండో బహుమతి అందుకుంటున్న అమరావతి - రాజంపేటలో కొండూరు భరత్‌కుమార్‌రాజు నుంచి రెండో బహుమతి అందుకుంటున్న స్వర్ణలత

కడప (కల్చరల్) జనవరి 7: నింగిలోని చుక్కలే భువిపై ముత్యాల ముగ్గులై విరిశాయని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు విలువిస్తూ సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి 2005 నుంచి ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. ఆదివారం ఉమ్మడి కడప జిల్లాలో కడప, రాజంపేట, రాయచోటిలో ముగ్గుల పోటీలను చేపట్టింది. ఏబీఎన్- ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాలముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన, సౌజన్యంతో పోటీలు జరిగాయి. కడపలో స్థానిక ఐటీఐ సమీప వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రాయచోటిలో కొత్తపేట రోడ్డులోని రాజు ఇంగ్లీష్ మీడియం స్కూల్ (ఒలంపియాడ్ బ్రాంచ్), రాజంపేటలో శాన్వీ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో పోటీలు ఏర్పాటు చేశారు. సరిగ్గా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ నిర్వహించిన పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున హాజరై రంగవల్లులను తీర్చిదిద్దారు. కడపలో నిర్వహించిన పోటీలకు ప్రొద్దుటూరు, కడప, బద్వేలు, వల్లూరు, కమలాపురం, రాయచోటిలో నిర్వహించిన పోటీలకు చుట్టుపక్కల ప్రాంతాలు సహా బయటి ప్రాంతీయులు, రాజంపేటలో నిర్వహించే పోటీలకు రాజంపేట, నందలూరు, నెల్లూరు, ప్రొద్దుటూరు, కోడూరు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఉదయం 9 గంటల నుంచే వేదికలు వద్ద తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కడపలో సుమారు 70 మంది మహిళలు పాల్గొన్నారు. రాయచోటిలో 111 మంది, రాజంపేటలో వంద మంది పైచిలుకు మహిళలు పాల్గొన్నారు. కడపలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ముఖ్య అతిథి వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ చైర్మన్ సరస్వతమ్మ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఏబీఎన్- ఆంధ్రజ్యోతి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. గెలుపోటములు సాధారణమని, విజేతలెవరన్నది ప్రధానం కాదని ప్రతిభ ఏపాటిదో తెలుసుకునే ఒక మంచి వేదిక కల్పించిన ఏబీఎన్- ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. వివిధ రూపాల్లో మంచి మంచి ముగ్గులు వేసిన ప్రతి మహిళా ప్రతిభావంతురాలే అని ఈ రోజు విజేత కాని వారు వచ్చే ఏడాది విజేతగా నిలిచేలా మరింత పట్టుదలతో రాణించాలన్నారు. వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ మాట్లాడుతూ మహిళలు చాలా మంచిగా ముగ్గులువేశారని, అందు నుంచి ముగ్గురిని నిష్పక్షపాతంగా న్యాయనిర్ణేతలు ఎంపికచేశారన్నారు. చుక్కలు, సంప్రదాయం, ముగ్గు తాలూకు ఔట్‌లుక్‌ను బేరీజు వేసుకుని విజేతలను ప్రకటించారన్నారు. ఆంధ్రజ్యోతి యూనిట్ మేనేజర్ అబ్బిగారి నరసయ్య మాట్లాడుతూ 2005 నుంచీ క్రమం తప్పకుండా ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి విజేతకు రూ.6వేలు, ద్వితీయ విజేతకు రూ.4 వేలు, తృతీయ విజేతకు రూ. 3 వేలు నగదు బహుమతులు, మరో పది మందికి కన్సొలేషన్ బహుమతులు అందించామన్నారు.

మొదటి విజేతగా శ్వేత

ముగ్గుల పోటీల్లో ప్రథమ విజేతగా కడప శంకరాపురం వాసి శ్వేత నిలవగా ద్వితీయ విజేతగా ప్రొద్దుటూరుకు చెందిన రమాదేవి, తృతీయ విజేతగా సునీత నిలిచారు. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కన్సొలేషన్ బహుమతులుగా ఒక్కొక్కరికి ఒక్కోచీర అందజేశారు. కాగా పోటీల్లో పాల్గొన్న మిగతా వారందరికీ ప్రత్యేక బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా సరస్వతమ్మతో పాటుగా ఇందిర, స్వర్ణలత వ్యవహరించారు. కార్యక్రమంలో ఏబీఎన్- ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

మరిచిపోలేని అనుభూతి



రాజంపేట శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీల్లో తాను నెల్లూరు జిల్లా పొదలకూరు నుంచి సుదీర్ఘ ఘాట్ రోడ్డు గుండా రాజంపేటకు వచ్చి ఈ పోటీల్లో మూడేళ్లగా పాల్గొంటున్నా. ఏటా ఏదో ఒక బహుమతి లభిస్తోందని, ఈ ఏడాది ప్రథమ విజేతగా తాను ఎన్నికవడం మరిచిపోలేని అనుభూతన్నారు.

మొదటి విజేత లక్ష్మీదేవి





ఎంతో సంతోషాన్నిచ్చింది



శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొని రెండవ విజేతగా నిలవడం తనకెంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు.

సుమలత, ద్వితీయ విజేత

సృజనాత్మకతను వెలికి తీయవచ్చు



మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయవచ్చు. ఇటువంటి పోటీలు నిర్వహించి మహిళలను చైతన్యం తీసుకురావచ్చన్నారు. ఇది ఎంతో అభినందనీయమన్నారు.

బుజ్జమ్మ, తృతీయ విజేత

రాజంపేటలో విశేష స్పందన

రాజంపేట, జనవరి7: ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో బయటి జిల్లా వాసులు సైతం పాల్గొన్నారు. శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంటు కొండూరు శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో వారి తనయుడు కొండూరు భరత్‌కుమార్‌రాజు, సీఈఓ శంకర్‌రాజు, ప్రిన్సిపాల్ విజయనిర్మల విజేతలకు అభినందనలు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా రేణుకమ్మ, విజయనిర్మల, శివమ్మ వ్యవహరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సువిశాల శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

మన సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు

ముగ్గులు మన సంస్కృతి, సంప్రదాయాలకు నెలవని ముగ్గుల పోటీ కార్యనిర్వాహకులు, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంటు కొండూరు శరత్‌కుమార్ రాజు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏటా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఆంధ్రజ్యోతి కడప యూనిట్ ఎడిషన్ ఇన్‌చార్జి సుంకోజి దేవేంద్రాచారి మాట్లాడుతూ శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఐదేళ్లగా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం, శరత్‌కుమార్‌రాజు ప్రోత్సహించడం పట్ల అభినందనలు తెలియజేశారు.

రాయచోటి పోటీకి మహిళల స్పందన

రాయచోటి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో ముగ్గులు ఆకర్షణీయంగా ఉన్నాయి. న్యాయనిర్ణేతలుగా ప్రశాంతి, తేజ, రాధ వ్యహరించారు. ప్రథమ బహుమతిని రాయచోటికి చెందిన భవాని, ద్వితీయ బహుమతి అమరావతి, తృతీయ బహుమతిని హిమబిందు గెలుచుకున్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాజు విద్యాసంస్థల సీఈఓలు సదాశివరెడ్డి, లలిత, వెంకట్రామరాజు, రమేష్‌రెడ్డి, ఉమా, గోపీకృష్ణ, రాధ, విద్యాసంస్థల సిబ్బంది హాజరయ్యారు. ఆంధ్రజ్యోతి అన్నమయ్య బ్యూరో గౌనిపల్లె శ్రీనివాసులు, రాయచోటి రిపోర్టర్లు పి.వి నాగయ్య, ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, మోహన్, తిరుపాల్‌నాయక్, రామయ్య, దేవరాజ్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.







కడపలో అతిథుల నుంచి మూడో బహుమతి అందుకుంటున్న సునీత - రాయచోటిలో తృతీయ బహుమతి అందుకుంటున్న హిమబిందు - రాజంపేటలో మూడో బహుమతి అందుకుంటున్న వి.బుజ్జమ్మ



రాజంపేట ముగ్గుల పోటీలో ప్రోత్సాహక బహుమతులు పొందిన మహిళలు

పదేళ్లగా పాల్గొంటున్నా



ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో సుమారు పదేళ్లగా పాల్గొంటున్నా. మహిళలు వంటగదికే పరిమితం కాకుండా ముగ్గుల పోటీల్లో పాల్గొనేలా ఆంధ్రజ్యోతి వారు చేపడుతున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. ఈసారి రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచి కడప పేరు నిలబెడతా. మహిళల్లో దాగివున్న సృజనాత్మకతను ముగ్గుల రూపంలో తీసుకురావడం చాలా సంతోషంగా వుంది. ఈ అవకాశం కల్పించిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు వ్యక్తం చేశారు.

శ్వేత, మొదటి విజేత, శంకరాపురం, కడప

ఆంధ్రజ్యోతి మహిళలకు ఇచ్చే కానుక



ఏటా సంక్రాంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి మహిళలకు ఇచ్చే కానుక ముత్యాల ముగ్గుల పోటీ. ఇతర దినపత్రికల వారు మహిళలకు పోటీలు ఏర్పాటు చేయడం మరచిపోయినా ఆంధ్రజ్యోతి వారు మాత్రం ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ తెలుగు సంప్రదాయలను కనుమరుగు కాకుండా చేస్తున్న తీరు పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

రమాదేవి, ద్వితీయ విజేత, లైటుపాళెం, ప్రొద్దుటూరు

వచ్చే ఏడాది ప్రథమ స్థానం సాధిస్తా



గెలుపోటములను సమానంగా తీసుకున్న వారే ఉత్తమంగా రాణిస్తారు. ప్రస్తుతం తృతీయ విజేతగా నిలవడం చాలా ఆనందంగా వుంది. వచ్చే ఏడాది ప్రథమ విజేతగా నిలవడమే లక్ష్యంగా శ్రమిస్తా

సునీత, తృతీయవిజేత, ప్రొద్దుటూరు

మొదటి ప్రయత్నంలోనే ప్రథమ బహుమతి



నేను గతంలో ఎప్పుడూ ఈ ముగ్గుల పోటీలో పాల్గొనలేదు. స్నేహితుల సలహా మేరకు.. ఈసారి పాల్గొన్నాను. ఎలాగైనా బహుమతి సాధించాలనే ఉద్దేశంతో ప్రణాళిక ప్రకారం ఏం ముగ్గు వేయాలో నిర్ణయించుకుని ముగ్గు వేశాను. మొదటి బహుమతి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది.

భవాని, రాయచోటి

వచ్చే ఏడాది మొదటి బహుమతి సాధిస్తా



ఆరేళ్ల కిందట జరిగిన ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో మొదటి బహుమతి సాధించాను. ఈసారి రెండో బహుమతితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వచ్చే ఏడాది మొదటి బహుమతి సాధిస్తాను.

అమరావతి, రాయచోటి

నిర్లక్ష్యంతో.. మొదటి బహుమతి పోగొట్టుకున్నా



గతేడాది నాకు మొదటి బహుమతి వచ్చింది. ఈసారి కొంచెం నిర్లక్ష్యం చేయడంతో మూడో బహుమతితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వచ్చే ఏడాది మళ్ళీ మొదటి బహుమతికి ప్రయత్నం చేస్తా.

హిమబిందు, రాయచోటి

రామనపల్లెలో యువకుడి దారుణ హత్య

● పాత కక్షలా, తాత్కాలిక గొడవలా..?



గుర్రంపాటి అల్లీషేర్ మృతదేహం

చెన్నూరు, జనవరి 7: రామనపల్లెలో ఆదివారం రాత్రి గుర్రంపాటి అల్లీషేర్ (24) దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో అతన్ని గ్రామం పక్కనే ఓ మోరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి గొంతుకోసి హత్య చేశారు. గ్రామస్థుల కథనం మేరకు... అల్లీషేర్ ఆటో నడుపుతూ జీవించేవాడు. శబరిమలైకు వెళ్లి శనివారం తిరిగి ఇంటికి వచ్చాడు. అదేరోజు రాత్రి గ్రామానికి చెందిన మరో వ్యక్తితో గొడవపడ్డా డు. ఆదివారం రాత్రి కూడా మద్యం సేవించి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు కత్తు లతో పొడిచి గొంతుకోయడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ చిన్నపెద్దయ్య కడప డీఎస్పీ షరీఫ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన మృతదేహాన్ని పరిశీలించారు. ఈ హత్యకు గల కారణాలపై ఎస్‌ఐతో చర్చించారు. కాగా అల్లీషేర్ భార్యతో మనస్పర్థలు ఏర్పడడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

లారీ ఢీ - భిక్షగాడు మృతి



ఎర్రగుంట్ల, జనవరి 7: స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద లారీ ఢీకొనడంతో భిక్షగాడు వెంకటేశ్ మృతి చెందాడు. రాజంపేట వాసి వెంకటేశ్ ఆదివారం సాయంత్రం నాలుగురోడ్ల కూడలి వద్ద భార్య, మరికొందరితో కలిసి నడుచుకుంటూ వస్తుండగా లారీ ఢీకొంది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. కుడి కాలు, చేతికి కండరాలు బయటికి వచ్చాయి. కొద్దిసేపు ఆయన స్పృహలేకుండా పడిపోయాడు. తేరుకున్న తరువాత ఆయన్ను ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా మారి మృతి చెందినట్లు సమాచారం.

కారును ఢీకొన్న మోటార్‌సైకిల్

ఎర్రగుంట్ల ముద్దనూరు రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద మోటార్‌సైకిల్ కారును ఢీకొంది. యువకుడు బైక్‌ను నడుతూ క్రాస్ చేస్తూ కారును ఢీకొనగా కిందపడ్డాడు. స్వల్ప గాయాలు కావడంతో అతన్ని ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

ఓటమి భయంతో సజ్జల మాట్లాడుతున్నాడు

కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 7: రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందని ఓటమి భయంతోనే సజ్జల కాంగ్రెస్ పార్టీపై అవాకులు చవాకులు పేలుతున్నాడని రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అతిపెద్ద సెక్యులర్ పార్టీ అని తెలిపారు. దేశంలో అత్యుత్తమ పార్టీ ద్వారానే జగన్ ఎంపీ అయిన విషయం మరచిపోయారా అంటూ హితవుచెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో అరణ్యవాసం ముగిసిందని, రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో పూర్వవైభవం పొందుతుందన్నారు. పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. అన్ని విభాగాల్లో వైసీపీ వైఫల్యం పొందిందని అప్పులు ఫుల్, అభివృద్ధి నిల్ అన్నట్లు వైసీపీ పరిపాలన ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో రగలిపోతున్నారని, ఓటమి భయం పట్టుకోవడం వల్లే సజ్జల మాట్లాడుతున్నాడనే విషయం ప్రజలందరికి అర్థమవుతోందని తెలిపారు.

ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థలు చిన్నాభిన్నం

● ప్రస్తుత పరిస్థితుల్లో సీఎం పదవి ముళ్లకిరీటం

చంద్రబాబును వరించినా ఆచి తూచి వ్యవహరించాలి ● త్వరలో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా

● ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య



కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 7: రాష్ట్రంలో ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయినా సీఎం పదవి ముళ్ల కిరీటంతో సమానమని.. ఆచితూచి వ్యవహరించాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. ఆదివారం కడప నగరంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనలో భాగస్వామ్యం కాకూడదనే ఏకైక లక్ష్యంతో రాజీనామా చేసినట్లు తెలిపారు. తనకు ఎమ్మెల్సీ పదవి ఇంకా మూడేళ్ల కాలం ఉన్నప్పటికీ రాజీనామా చేస్తున్నానన్నారు. ఇప్పటి వరకు రాజకీయ విలువలు కాపాడుకుంటూ వచ్చానన్నారు. వైసీపీలో ఉన్నందుకు చాలా కాలం నుంచి అంతర్మథనం పడుతున్నానన్నారు. కొంత కాలం నుంచి మీడియాకు కూడా దూరంగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. తప్పిదాలను జగన్‌కు చెప్పేందుకు చాలా ప్రయత్నం చేశామని తెలిపారు. అయితే ఆ అవకాశం తనకు రాలేదని తెలిపారు. జగన్‌పార్టీని వీడి బయటికి వచ్చినందుకు తనను గ్రాప్ అంటున్నారని, పార్టీలో చేరమని తన ఇంటి చుట్టూ తిరిగినప్పుడు గ్రాప్ అని తెలియలేదా అని ప్రశ్నించారు. వైసీపీలో రాజకీయం ప్రజాస్వామ్యం కనిపించడం లేదన్నారు. సలహాదారులైనా సరైన సలహాలు జగనకు ఇచ్చి మారిస్తే బాగుంటుందన్నారు. వందల కోట్లు ప్రజాధనం కోర్టు కేసులకు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రూ.12 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. రాష్ట్రంలో ఆదాయం వచ్చే సెక్టారు దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసుల కోసం కేంద్రంతో రాజీ పడి రాష్ట్రానికి కావాల్సిన ప్రాజెక్టులను వదులుకుంటున్నారని తెలిపారు. సాధికారత సభలు నిర్వహిస్తే ఏం లాభమని ప్రశ్నించారు. ప్రజలకు నమ్మకం కలిగేలా చేయాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ పాల్గొన్నారు.

లైన్‌మెన్‌ను తిట్టాడని... పోలీసులకు ఫిర్యాదు

బి.కోడూరు, జనవరి 7: పాత విద్యుత్ బిల్లు కట్టమని అడిగినందుకు లైన్‌మెన్ సుబ్బరాయుడును యడవల్లి గురుప్రసాద్ తిట్టాడని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బిల్లు కట్టమని అడగడంతో మేం కట్టం, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోపో అని దుర్భాషలాడి అవమానపరిచి బెదిరించి సెల్‌ఫోను లాక్కున్నాడని పోరుమామిళ్ల ఏడీ నాయక్‌కు జరిగిన విషయం తెలిపారు.

దీంతో ఆయన బి.కోడూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయమని చెప్పడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడని, కులం పేరుతో దూషించాడ ని అతనిపై విచారించి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరినట్లు లైన్‌మెన్ సుబ్బరాయుడు తెలిపారు.

10, 11 తేదీల్లో కేంద్ర కర్మచారీ సభ్యుడు రాక

కడప(కలెక్టరేట్) జనవరి 7: కేంద్ర సఫాయి కర్మచారీస్ కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ వవ ఈనెల 10, 11 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కర్నూలు నుంచి బయలు దేరి రాత్రి 8 గంటలకు కడపకు చేరుకుని.. రాత్రికి బసచేస్తారు. 11వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కమిషనర్‌తో కలసి సంబంధిత అధికారులు, కర్మచారీస్‌లతో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాల్లో కలెక్టర్, ఎస్పీలతో కలిసి సంబంధిత జిల్లా అధికారులు, సఫాయి కర్మచారీస్‌తో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం తిరుపతికి వెళతారని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర స్థాయి 36గంటల ధర్నా జయప్రదం చేయండి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 7: ఉద్యోగ ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ పొదుపు సొమ్మును ప్రభుత్వం తమ అవసరాలు తీర్చడంలో విఫలమైందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ఆరోపించారు. రాష్ట్రంలో 36గంటల ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య నేతల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్థిక బకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ తాలుకా స్థాయిలో ఆరుగంటల ధర్నా, జిల్లాస్థాయిలో 12గంటల ధర్నా నిర్వహించామన్నారు. ప్రభుత్వంలో స్పందన లేకపోవడం సిగ్గుచేటన్నారు.

రుయాలో ప్రైవేటు అంబులెన్స్‌ల హల్‌చల్

● ఒక్కో వాహన అనుమతికి రూ.వంద వసూలు



పగలు ఆస్పత్రి ముందు పార్కింగ్ చేసివున్న ప్రైవేటు అంబులెన్సులు - రాత్రిపూట రుయాస్పత్రి ఆరవణలో ఆగివున్న ప్రైవేటు అంబులెన్సులు

తిరుపతి సిటీ, జనవరి 7: రుయాస్పత్రి ప్రైవేటు అంబులెన్సులకు అడ్డాగా మారుతోంది. ఆస్పత్రి ఆవరణలో ప్రైవేటు అంబులెన్సులను నిలపరాదని అధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు. పగలంతా ఆస్పత్రి ముందే నిలిపివుండే వాహనాలు చీకటిపడితే ఆస్పత్రి ఆవరణలోకి చేరిపోతున్నాయి. సాయంత్రం 6 గంటల తర్వాత అడిగే వారు లేకపోవడంతో అత్యవసర విభాగం ముందు పార్కింగ్ చేసేస్తున్నారు. అడ్డుకోవాల్సిన సిబ్బంది ఒక్కో అంబులెన్సుకు రూ.వంద లెక్కన తీసుకుని అనుమతిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో ప్రైవేటు అంబులెన్సుల నిర్వాహకులు నేరుగా వార్డుల్లోకి వెళ్లి రోగులతో బేరాలు కుదుర్చుకుంటున్నారు. దీనికితోడు రాత్రిళ్లు బయటి నుంచి వచ్చే ఇతర ప్రైవేటు వాహనాలను లోపలకు అనుమతించకపోతుండడంతో వీరు అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎన్నికల విధులు - బదిలీలకు అవకాశం

● ఉద్యోగుల వివరాల సేకరణలో జిల్లా యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 7: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల వివరాలు ఖజానా శాఖ నుంచి సేకరించే కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ఎన్నికల నిర్వహణతో సంబంధం ఉన్న అధికారులు, ఉద్యోగులను ప్రస్తుతం పని చేస్తున్న జిల్లా నుంచి బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నేపథ్యంలో గడచిన నాలుగేళ్లలో మూడేళ్ళ పాటు ఒకే జిల్లాలో పనిచేసివుంటే వారిని ఇక్కడి నుంచి మార్చాలని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. 2024 జూన్ 30 నాటికి చిత్తూరు జిల్లాలో మూడేళ్ళు సర్వీసు పూర్తిచేసుకోబోయే వారికి ఈ జిల్లాలో పోస్టింగ్ ఇవ్వవద్దని పేర్కొంది.

జాబితా తయారీలో నిమగ్నం

కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల నేపథ్యంలో జిల్లా అధికారులు శాఖల వారీగా బదిలీకి అర్హులైన అధికారులు, సిబ్బంది జాబితా తయారీలో యంత్రాంగం గత వారం రోజులుగా తలమునకలయ్యారు. జిల్లావ్యాప్తంగా అన్నిశాఖల ఉన్నతాధికారులకు వారి శాఖల్లో మూడేళ్ళ సర్వీసు పూర్తిచేసుకున్న వారి వివరాలు ఇవ్వాలని కలెక్టరేట్ నుంచి ఆదేశాలు వెళ్ళాయి. మరో వైపు సమగ్ర వివరాలు ఇవ్వాలని జిల్లా ఖజానాశాఖకు సైతం ఆదేశాలిచ్చాయి.

ప్రధానంగా ఈ అంశాలు

అధికారి సొంత జిల్లా, ఈ జిల్లాలో ఎన్నాళ్ళనుంచి పని చేస్తున్నారు, ఎప్పుడు ఉద్యోగ విరమణ చేయనున్నారు, వారిపై ఏమైనా క్రమశిక్షణ చర్యలు పెండింగ్‌లో ఉన్నాయా తదితర అంశాలన్నీ బదిలీల జాబితాలో కీలకంగా మారబోతున్నాయి. కాగా బదిలీలు పాత ఉమ్మడి చిత్తూరు జిల్లావారీగా చేపడతారా లేక విభజన అనంతరం ఏర్పడిన తిరుపతి, అన్నమయ్య నూతన జిల్లాలవారీగా నిర్వహిస్తారా అనే విషయంపై ఇప్పటికి స్పష్టత రాలేదని సమాచారం.

రెవెన్యూ కీలకం : ఎన్నికల విధుల్లో కీలకమైన రెవెన్యూలో లోతైన కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో ఒకేచోట మూడేళ్ళ సర్వీసు పూర్తిచేసిన తహసీల్దార్ స్థాయి అధికారుల జాబితా పెద్దగానే ఉన్నట్లు సమాచారం. వీరిలో కొందరు కలెక్టరేట్, మండలాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

వీరికి మినహాయింపు : ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉండి ఆరునెలల వ్యవధిలో విరమణ చేయనున్న అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేయవద్దని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరికి ఏవిధమైన ఎన్నికల విధులు కేటాయిస్తారో తెలియడం లేదు.

ఇతర శాఖల్లో

పోలీసు శాఖలో పలువురు సీఐలు, ఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్, ఏఎస్‌ఐలుగా విధులు నిర్వహిస్తున్న వారు ఎక్కువగా స్థానికులై ఉన్నారు. జిల్లాపరిషత్‌లో ఎంపీడీవోల బదిలీలు తరచూ జరుగుతున్నాయి. పంచాయతీరాజ్ వంటి శాఖల్లో పాలకపక్ష నేతల ఆశీస్సులతో అనేక సంవత్సరాలుగా ఇక్కడే ఉండి విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు ఎక్కువగానే ఉన్నారు. వీరు ఎన్నికల బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్ళక తప్పదని పలువురు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఇదేం బరితెగింపు..!

శ్రీకాళహస్తిలో కొందరు అధికార పార్టీ నేతలు అక్రమాలతో చెలరేగిపోతున్నారు. పట్టణ పరిధిలోని స్వర్ణముఖి నదిలోకి చొరబడి మట్టి, ఇసుకను కొల్లగొట్టారు. భారీ యంత్రాలు, టిప్పర్లతో బాహాటంగా తవ్వకాలు చేయడాన్ని చూసిన వారంతా ఇదేం బరితెగింపు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.


నదిలోకి అక్రమార్కులు వేసిన రోడ్డు


ప్రైవేటు స్థలంలోకి డంపింగ్


యంత్రాలతో జోరుగా తవ్వకాలు

నదిలోకి దర్జాగా రోడ్డు ఏర్పాటు

భారీ యంత్రాలు పెట్టి మట్టి, ఇసుక తరలించేసిన అధికార పార్టీ నేతలు

శ్రీకాళహస్తిలో స్వర్ణమ్మ శోకం

శ్రీకాళహస్తి జనవరి 7: ముక్కంటి భక్తులు ఎంతో పవిత్రంగా ఆరాధించే స్వర్ణముఖి నదిలో ఎన్నో ఏళ్ల క్రితమే ఇసుక తవ్వకాలను నిషేధించారు. నిబంధనలతో తమకేం పని అనుకున్నారేమో.. కొందరు అధికార పార్టీ నేతలు ఏకంగా నదిలో అనధికారిక రోడ్డును నిర్మించారు. ఆపై ప్రైవేటు వెంచర్ కోసం నదిలోని మట్టి, ఇసుకను భారీ యంత్రాలతో దర్జాగా తవ్వి తరలించారు.

అధికారం అండతోనే..

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వెనుక నది ఒడ్డున ప్రైవేటు భూమి ఉంది. ఇందులో వెంచర్ వేయడానికి కొందరు అధికార పార్టీ నేతలు కసరత్తు ప్రారంభించారు. అధికారం అండగా ఉండడంతో.. ఎవరు అడ్డుకుంటారన్న ధీమాతో రెండ్రోజుల నుంచి క్రషర్ దుమ్ముతో నదిలోకి రోడ్డు వేశారు. ఆదివారం భారీ యంత్రాలతో నదిలోకి చొరబడి యథేచ్ఛగా తవ్వకాలు సాగించారు. స్థానికుల సమాచారంతో ఆంధ్రజ్యోతి అక్కడికి వెళ్లి ఫొటోలు తీసింది. నదిలో మట్టి, ఇసుక తవ్వకాలు చేస్తున్న యంత్రాల మధ్య ముక్కంటి ఆలయం రాజగోపురం కూడా స్పష్టంగా కనిపిస్తుండటం గమనార్హం. ఆంధ్రజ్యోతి వచ్చిన విషయం తెలుసుకున్న అక్రమార్కులు వెంటనే అక్కడి నుంచి ఉడాయించారు.

నేడు విజయవాడకు కలెక్టర్, ఎస్పీ పయనం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 7: త్వరలో జరిగే సాధారణ ఎన్నికల సన్నాహక ఏర్పాట్లపై సమీక్షకు కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 9వ తేదీన రాష్ట్రానికి రానుంది. ఈనేపథ్యంలో 9, 10 తేదీల్లో విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో సమావేశం జరుగుతుంది. ఇందులో పాల్గొనేందుకోసం సోమవారం కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి బయలుదేరి వెళ్తున్నారు. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తీసుకొనే చర్యలపై వీరు కేంద్ర ఎన్నికల సంఘ అధికారులకు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

మినీ వ్యాన్ ఢీకొని ఒకరి మృతి


రవీంద్రబాబు (ఫైల్‌ఫొటో)

పూతలపట్టు, జనవరి 7: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని మినీ వ్యాన్ ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మండలంలోని కె. మోటకంపల్లె గ్రామానికి చెందిన రవీంద్రబాబు (61) బెంగళూరులో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఈయన శనివారం రాత్రి స్వగ్రామానికి వస్తూ కొత్తకోట సమీపాన గల ఓ హోటల్ వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుంచి చిత్తూరు వైపుగా వెళ్తున్న మినీ వ్యాన్ ఢీకొంది. దీంతో రవీంద్రబాబు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ మేరకు ఎస్‌ఐ రామ్‌భూపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందెం స్థావరంపై దాడి

ఏడుగురిపై కేసు - 15 కోళ్లు, రూ.46 వేలు స్వాధీనం

గుడుపల్లె, జనవరి 7: మండల పరిధి పెద్దభజనవాడ గ్రామ సమీపంలోని మామిడి తోపులో ఉన్న కోడి పందెం స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 15 కోళ్ళు, రూ.46 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

నాటుసారా తాగి మదనపల్లెవాసి మృతి



పుంగనూరు రూరల్, జనవరి7: నాటుసారా తాగి మదనపల్లెవాసి మృతి చెందిన ఘటన ఆదివారం పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్ద జరిగింది. స్థానికుల సమాచారం మేరకు... సుగాలిమిట్ట గ్రామ సమీపంలో అతిగా నాటుసారా తాగి స్పృహ కోల్పోయి పడి ఉన్నట్టు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం మోతీనగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిసింది. పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు.

ఏపీపీఎస్‌టీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం


కొత్త కార్యవర్గ ప్రతినిధులకు నియామకపత్రాన్ని అందిస్తున్న మోహన్‌బాబు

తిరుపతి(విద్య),జనవరి 7 : స్థానిక టీపీపీఎం పాఠశాలలో ఏపీ ఫిజికల్‌సైన్స్ టీచర్స్ ఫోరమ్(ఏపీపీఎస్‌టీఎఫ్) ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.మోహన్‌బాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కేడీ సారథి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.మోహన్ నాయుడు, కె.మేఘనాథ్, ఉపాధ్యక్షులుగా పి.రవి, ఆర్థిక కార్యదర్శిగా టి.మనోహర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎస్.కోదండపాణి, కె.రాజేష్‌బాబు, మహిళా కార్యదర్శులుగా ఎస్.సౌజన్య, కె.రాధారాణి, సంయుక్త కార్యదర్శులుగా డి.ధనంజయ, ఎ.మోహన్, డివిజనల్ కార్యదర్శులుగా కె.వెంకటేశ్వర, ఎస్.గజరాజన్, ఎం.సుబ్బరామయ్య, బి.రాజ్‌కుమార్, పి.కోటేశ్వరరావు, చెంగల్వరాయలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షుడు నియామకపత్రాన్ని అందించి అభినందించారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు చెందిన టీచర్లు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం

చిత్తూరు, జనవరి 7: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి కలెక్టర్, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరిస్తారన్నారు. సమస్యలను విన్నవించుకునేందుకు వచ్చేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

ఎస్పీ కార్యాలయంలో..: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు.

అమ్మగారిపల్లెలో జల్లికట్టు



పాకాల, జనవరి 7: మండలంలోని కె.వడ్డేపల్లె పంచాయతీ అమ్మగారిపల్లెలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తలను అలంకరించి కొమ్ములకు బహుమతులు కట్టి వీధుల్లో పరుగులు తీయించారు. కోడెగిత్తలను నిలువరించి బహుమతులు దక్కించుకోవడానికి యువత వాటి వెంట పరుగులు తీశారు. జల్లి కట్టు తిలకించడానికి పరిసర గ్రామాల ప్రజలు అమ్మగారిపల్లెకు వచ్చి సందడి చేశారు.

చిత్తూరుకు చేరిన డిజిటల్ ఓటరు గుర్తింపు కార్డులు


కలెక్టరేట్‌కు చేరిన డిజిటల్ ఓటరు గుర్తింపు కార్డులు - స్కానింగ్ చేస్తున్న పోస్టల్ ఉద్యోగి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 7: ఓటర్లకు పంపిణీ చేసేందుకు కొత్త డిజిటల్ ఎపిక్ (ఓటరు) గుర్తింపు కార్డులు రెండ్రోజుల క్రితం జిల్లా కేంద్రానికి చేరాయి. నాలుగో విడతగా 80వేల ఎపిక్ కార్డులను ఎన్నికల సంఘం పంపింది. మూడు విడతల్లో ఇదివరకు 79వేల కార్డులు అందాయి. కలెక్టరేట్‌లోని జిల్లా ఎన్నికల విభాగానికి అందిన ఎపిక్ కార్డుల స్కానింగ్ ప్రక్రియను ఐదుగురు రెవెన్యూ సిబ్బంది చేపడుతున్నారు. మరోవైపు తపాలాశాఖ సిబ్బంది స్కానింగ్ చేపట్టారు. వీటిని తపాలాశాఖ ద్వారా రిజిష్టర్ పోస్టులో ఓటర్ల ఇళ్లకే పంపిస్తామని డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. ఒకవేళ పోస్టల్ చిరునామా తప్పుగా వుంటే వాటిని సచివాలయ వలంటీర్ ద్వారా ఓటరుకు అందజేస్తామన్నారు. గతంలో పాత ఓటరు గుర్తింపుకార్డులపై 14 అంకెల సంఖ్య ఉండేది. ఇప్పుడు జారీ అవుతున్న కొత్త ఎపిక్ కార్డుల్లో 10 అంకెలు (తొలి మూడు ఆంగ్ల అక్షరాలు, మిగిలిన ఏడు అంకెలు) ఉన్నాయి. ఒక్కొక్క నియోజకవర్గానికి ప్రత్యేకంగా మూడు ఆంగ్ల అక్షరాలు, ప్రత్యేక సిరీస్ ఉంటుంది.

యువతిని కత్తితో బెదిరించి దోపిడీ

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7 : జాతీయ రహదారిలో నిర్మానుష్య ప్రాంతంలో వాష్‌రూమ్‌కు వెళ్లిన యువతిని ఇద్దరు దుండగులు కత్తితో బెదిరించి బంగారు ఉంగరాలు, సెల్‌ఫోన్లు కాజేసిన విషయంపై ఆదివారం తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. చంద్రగిరి డీఎస్పీ డాక్టర్ యశ్వంత్, రూరల్ ఎస్సై నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.. పుంగనూరుకు చెందిన మాధవి తిరుపతిలోని ఓ పీజీ హాస్టల్లో ఉంటూ సీఏ కోర్సు చదువుతోంది. పుంగనూరుకు చెందిన సిమెంట్, స్టీల్ వ్యాపారి దేవకుమార్ శనివారం తిరుపతికి వచ్చి తిరుగు ప్రయాణంలో మాధవిని తనతో పాటు ఆయన కారులో తీసుకువెళ్లాడు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో వెళుతుండగా మాధవి వాష్‌రూమ్‌కి వెళ్లాలని చెప్పడంతో శ్రీవకుళమాత ఆలయ సమీపంలో దేవకుమార్ కారును ఆపారు. ఆ పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రాంతంలోకి మాధవి వెళ్లింది. ఇద్దరు దుండగులు మాధవి దగ్గరకు వెళ్లి కత్తితో బెదిరించి ఆమె వద్ద ఉన్న బంగారు ఉంగరాలు కాజేశారు. అంతటితో ఆగక ఆమెను కారు వద్దకు తీసుకువచ్చి అదే కారులో మాధవి, దేవకుమార్‌ను కిడ్నాప్ చేసి భారీ మొత్తంలో నగదు కాజేసేందుకు నేండ్రగుంట వైపు తీసుకువెళ్లారు. కారు టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే అందులో ఉన్న మాధవి కిందకు దూకేసి పెద్దగా కేకలు వేయడంతో ఆ ఇద్దరు దుండగులు కారి దిగి పారిపోయారు. ఈ మేరకు బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు టోల్‌గేట్ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా దోపిడీకి పాల్పడిన వారు 25 ఏళ్లలోపు యువకులుగా గుర్తించారు. వీరిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

హోరాహోరీగా ఎస్వీయూ ఇంటర్ కాలేజీయేట్ స్టాఫ్ పోటీలు


షీల్డ్ అందుకుంటున్న టెన్నిస్ డబుల్స్ విజేతలు ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి, డాక్టర్ పి.మధుసూధన్‌రెడ్డి - షీల్డ్ స్వీకరిస్తున్న ఉమెన్ విన్నర్స్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 7: ఎస్వీయూ ఇంటర్ కాలేజీయేట్ మెన్ అండ్ ఉమెన్ స్టాఫ్ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. టెన్నిస్ డబుల్స్‌లో ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి, డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి విజేతలుగా నిలిచారు. మెన్స్ విభాగంలో బ్యాడ్మింటన్ సింగిల్ అండ్ డబుల్స్‌లో ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్(తిరుపతి) విజేతగా సీకాం డిగ్రీ కాలేజ్(కలికిరి) రన్నరప్‌గా నిలిచింది. టెన్నిస్ డబుల్స్‌లో ఎస్వీయూ కాలేజీ(తిరుపతి) గెలుపొందగా ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో ఎస్వీయూ కాలేజ్(తిరుపతి) విజేతగా ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ(తిరుపతి) గెలుపొందగా ఎస్వీయూ కాలేజీ(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. బాల్ బ్యాడ్మింటన్(మెన్)లో టీఎస్ఆర్ డిగ్రీ కాలేజీ(తిరుపతి) విజేతగా ఎస్వీయూ(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. చదరంగంలో ఎస్వీయూ కాలేజీ(తిరుపతి) గెలుపొందగా కుప్పం డిగ్రీ కాలేజీ(కుప్పం) రన్నరప్‌గా నిలిచింది. ఉమెన్స్ విభాగంలో బాల్‌బ్యాడ్మింటన్‌లో ఎస్వీయూ(తిరుపతి) విజేతగా ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. త్రోబాల్‌లో ఎస్వీయూ కాలేజీ(తిరుపతి)గెలుపొందగా ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది.

అదృశ్యమైన బాలిక మృతి

హత్యగా భావిస్తున్న మృతురాలి తల్లిదండ్రులు

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


సోనికుమారి (ఫైల్ ఫొటో) - అనుమానితుడు బాలకిషోర్

చంద్రగిరి, జనవరి7: చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె వద్ద జగనన్న కాలనీలో ఈనెల 2న అదృశమైన ఆరేళ్ళ బాలిక.. సమీప అటవీ ప్రాంతంలో ఆదివారం శవమై కనిపించింది. పోలీసుల కథనం మేరకు... జగనన్న కాలనీలో సిమెంటు ఇటుకల తయారీ కోసం జార్ఖండ్ నుంచి కొంత మంది కార్మికులను పదిరోజుల క్రితం కాంట్రాక్టర్ మధుకర్‌రెడ్డి పిలిపించారు. కార్మికులలో ఒకరైన రాజేష్‌నాయక్ తన కుమార్తె సోనికుమారి(6) ఇటుకల బట్టీ వద్ద ఆడుకొంటూ కనిపించకుండా పోయిందని ఈనెల 2న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం జగనన్న కాలనీ సమీప అటవీ ప్రాంతంలో సోనికుమారి మృతదేహం లభ్యమైంది. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. అయితే మృతురాలి తల్లి మాట్లాడుతూ తన కుమార్తె సోనికుమారి అదృశ్యమైన రోజు జార్ఖండ్‌కు చెందిన బాలకిషోర్‌పై అనుమానం వచ్చి అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించామని, అయితే పోలీసులు బాలకిషోర్‌ను వదిలిపెట్టేసారని చెప్పారు. గత గురువారం బాలకిషోర్ తన కుటుంబ సభ్యులతో కలిసి పరారయ్యాడని తెలిపారు. పోలీసుల నిర్లక్ష్యం వలనే తన కుమార్తె హత్యకు గురైందని వెల్లడించారు.

బాలిక మృతదేహాన్ని పరిశీలించిన పులివర్తి నాని

టీడీపీ నేత పులివర్తి నాని ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గంజాయి బ్యాచ్ వలనే ఈ దారుణం చోటు చేసుకుందని, చంద్రగిరి నియోజకవర్గం గంజాయి హబ్‌గా మారిందన్నారు. గంజాయి మత్తులోనే అభం శుభం తెలియని బాలికపై అత్యాచారం చేసి హత్య చేసి ఉంటారని పేర్కొన్నారు. గతంలో చంద్రగిరిలో ఓ బాలికకు గంజాయి విక్రయిస్తూ ఎమ్మెల్యే బ్యాచ్ పట్టుబడ్డారని, నారావారిపల్లె సర్పంచ్ భర్తపై దాడి, భీమవరం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిపై గంజాయి బ్యాచ్ దాడులు చేశారని గుర్తుచేశారు. వరుస ఘటనలు జరుగుతున్నా చంద్రగిరి పోలీసులు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదన్నారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రాజేష్‌నాయక్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

టీడీపీ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు


సీఆర్ రాజన్ - భీమనేని చిట్టిబాబు

చిత్తూరుసిటీ/వెదురుకుప్పం, జనవరి 7: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు లభించింది. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని తిరుచానూరుకు చెందిన సీఆర్ రాజన్, పాలసముద్రం మాజీ జడ్పీటీసీ, ప్రభావశీలుల గుర్తింపుకమిటీ సభ్యుడు భీమనేని చిట్టిబాబు నాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని చిట్టిబాబు చెప్పారు.

వరిలో జింక్ లోపాన్ని నివారించండి


జింక్‌లోప లక్షణాలతో ఉన్న వరిపైరు

తిరుపతి(విద్య), జనవరి 7: రబీలో వరి పైరుకు జింక్ తక్కువయితే దిగుబడిపై ప్రభావం చూపుతుందని, పైరు పచ్చగా ఎదిగి బాగా దుబ్బు చేసేందుకు జింక్ చాలా అవసరమని వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఈశాన్య రుతుపవన వర్షాలు ఆలస్యం కావడం వల్ల చాలా మంది రైతులు దుక్కిలో జింక్ ఎరువును సిఫారసుల మేరకు వేయలేకపోయారని, దాంతో వరిలో ఈ లోపం ఎక్కువగా కనిపిస్తుందని అన్నారు. సున్నం, చౌడు, భాస్వరం ఎక్కువ ఉన్న భూముల్లో మొక్కలకు జింక్ సరిగా అందదని, మురుగునీరు బయటకుపోని పల్లపు ప్రాంతాలలో కూడా జింక్ లోపం ఎక్కువగా కనిపిస్తుందని వివరించారు. దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు.

● **లోప లక్షణాలు ఇలా :** వరినాటిన 2-6వారాల మధ్య లోప లక్షణాలు కనిపిస్తాయని, మొక్కల్లో పెరుగుదల మందగించి గిడసబారుతాయని పేర్కొన్నారు. పిలకలు రావడం తగ్గుతుందని, మొక్కల మధ్య ఆకులలో ఈనెల మధ్యభాగం పసుపురంగుకు మారుతుందన్నారు. ముదురు ఆకు చివర్లలో తుప్పు మచ్చలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఆకులు పెలుసుగా ఉండి వంచితే శబ్దం చేస్తూ సులభంగా విరిగిపోతాయని తెలిపారు. పొలంలో అక్కడక్కడా మొక్కలు సరిగా పెరగకుండా ఖాళీలు కనిపిస్తాయన్నారు.

● **నివారణ చర్యలు :** మురుగునీరు బయటకుపోని పొలాల్లో నాటిన రెండు వారాల తర్వాత పాతనీరు పూర్తిగా తీసేసి కొత్తనీరు అందించాలని తెలిపారు. చౌడు భూముల్లో మొదటి దఫా పైపాటుగా వేసే యూరియాకి బదులుగా అమ్మోనియం సల్ఫేట్ వేస్తే చౌడుగుణం తగ్గి జింక్ పెరుగుతుందని వివరించారు. వరిపైరులో ఈ లోప లక్షణాలు కనిపిస్తే లీటరు నీటికి 2గ్రాముల జింక్‌సల్ఫేట్, 5గ్రాముల యూరియాను వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేయాలని సూచించారు. చిలేటెడ్‌రూపంలో మార్కెట్‌లో దొరికే చిలామినిన్ జింకును లీటరు నీటికి గ్రాము చొప్పున కలిపి అవసరాన్ని బట్టి ఒకటి రెండుసార్లు స్ప్రే చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఇతర వివరాల కోసం 8331057872ను సంప్రదించాలని కోరారు.

యువకుడు అనుమానాస్పద మృతి

కలికిరి, జనవరి 7: మండలంలోని పల్లవోలు పంచాయతీ తూర్పుపల్లెకు చెందిన యువకుడు గుర్రంకొండ వెంకటేశు (19) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఏఎస్ఐ మధుసూదనాచారి తెలిపారు. కలికిరిలోని ఒక కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న అతను ప్రతి రోజులాగానే ఆదివారం కూడా పొలం దగ్గరకు వెళ్లి ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ వెళ్లారు. పొలం సమీపంలోని ఒక బండ పైన వెంకటేశు పడుకొని ఉండగా ఏమైందని పరిశీలించగా చనిపోయి ఉన్నట్లు తెలుసుకున్నారు. మృతుని తండ్రి గుర్రం కొండ కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా హచ్‌సీ జె.రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారన్నారు. వాల్మీకిపురం సీఐ సురేష్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారని ఏఎస్ఐ తెలిపారు. శవ పరీక్షల అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

నిమ్మనపల్లి, జనవరి 7: ఆటో ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకొంది. సుండుపల్లి మండలం ఫించాకు చెందిన ముబారక్(45) సొంత పనులపై నిమ్మనపల్లి మండలంలోని అగ్రహారంకు వచ్చాడు. పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో అగ్రహారం వద్ద ఆటో తన ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 సహాయంతో మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తలించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు

కురబలకోట, జనవరి 7: కారు, ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఆదివారం జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం రామారావు కాలనీ ఇకే కుటుంబానికి చెందిన నబీరనూల్(40), మహమ్మద్ ఆసీఫ్(28), సోఫియా(25), మహమ్మద్ ఆదిల్(3)లు ద్విచక్రవాహనంలో సొంత పనుల నిమిత్తం గుర్రకొండకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో జంగావారి పల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు అందించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ ముబీన్‌తాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణం సేల్స్‌మ్యాన్‌పై దాడి

మదనపల్లె టౌన్, జనవరి 7: ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సేల్స్‌మ్యాన్‌పై ముగ్గురు దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన శనివారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. డీఎస్పీ కేశప్ప కథనం మేరకు..చిత్తూరు బస్టాండు వద్ద ప్రభుత్వ మద్యం దుకాణం వద్దకు షేక్ సయ్యద్‌బాషా, కాలేషా అలియాస్ కాలు, ముబారక్‌లు మద్యం కొనగోలుకు వచ్చారు. మద్యం తీసుకున్నాక చిల్లర విషయమై సేల్స్‌మ్యాన్ మునీంద్రనాయక్‌తో వాగ్వాదం చేశారు. ఈ క్రమంలో వారు ముగ్గురు మద్యం దుకాణంలోకి చొరబడి మునీంద్రనాయక్‌పై దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేశామని డీఎస్పీ చెప్పారు.

కోడిపందేలపై ప్రత్యేక దృష్టి

మదనపల్లె టౌన్, జనవరి 7: మదనపల్లె పోలీసు డివిజన్‌లో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడి పందేలు, పేకాట శిబిరాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని డీఎస్పీ కేశప్ప తెలిపారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా మదనపల్లె, తంబళ్లపల్లె నియోజక వర్గాల్లో పేకాట, కోడి పందేలపై దాడులు నిర్వహిస్తున్నామన్నారు. సంక్రాంతి పండుగ కోసం సొంత వూర్లకు వెళ్లేవారు తప్పనిసరిగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దీని వలన లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టంను వారి ఇళ్ల వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో పాటు ఆయా ప్రాంతాల్లో రాత్రి పూట పోలీస్ బీట్లు పెంచుతామన్నారు. పట్టణంలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల గురించి సమాచారం అందిచాలన్నారు.

50 లీటర్ల నాటుసారా స్వాధీనం -ఒకరిపై కేసు నమోదు

పెద్దమండ్యం, జనవరి 7: పెద్దమండ్యం మండలం రామానాయక్ తండా గ్రామ పంచాయతీ గోనుపోతుల తాండ సమీపంలో 650 లీటర్ల నాటుసారా తయారీ ఊటను ధ్వంసం చేసి, 50 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయుడు వెల్లడించారు. ఆదివారం నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేసి సారా బట్టీలను ధ్వంసం చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్టు

కలకడ, జనవరి 7:మండలంలోని కదిరాయచెరువుకు సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న లక్ష్మీపతిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. అతని వద్ద రూ.3 వేలు విలువైన 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్లు వద్దు

గుర్రంకొండ, జనవరి 7:వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లను అమర్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర అన్నారు. మండలంలోని మర్రిపాడు, టి.రాచపల్లె గ్రామాల్లో ఆయన ఆదివారం రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం మోటార్లకు విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేయరాదన్నారు. దీంతో రైతులు పడరాని పాట్లు పడాల్సివస్తోందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటరమణరెడ్డి, రమేష్‌బాబు, మదన్ మోహన్, రెడ్డి, బాష, బాస్కర్‌లు పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించండి

మదనపల్లె అర్బన్, జనవరి 7: గ్రామ, వార్డు సచివాలయంలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీయూ భవన్‌లో ఎనర్జీఎంప్లాయిస్ అసోసియేషన్ మొదటివార్షికోత్సవ సందర్భంగా కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. వారికి ట్రెజరీ నుంచి జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎనర్జీ ఎంపాయిస్ అసోసియేషన్ రాష్ట్రకోశాధికారి సుధీర్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎల్ నరసింహులు, పట్టణ కార్యదర్శి తిరుమల, శ్రీనివాసులు, ముక్తియార్, సల్మాన్, వేదాంత్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

గుర్రంకొండ, జనవరి 7:పేదల సంక్షేమానికి బీజేపీ అన్ని విధాల కృషి చేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. ఆదివారం ఆయన గుర్రంకొండలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం గుర్రంకొండకు చెందిన మాజీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజును పార్టీలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పొత్తూరి శ్రీకాంత్, శ్రీనివాసులు, రెడ్డెన్న, రామాంజులు, రామూర్తి, శ్రీన పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించాలి

● ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలో ఆర్డీవో మురళి ● మదనపల్లెలో నిర్వహించిన పోటీలకు అనూహ్య స్పందన



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మురళి

మదనపల్లె, జనవరి 7: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు విలువనిస్తూ, వాటిని కొనసాగించాలని ఆర్డీవో ఎంఎస్‌మురళి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గులపోటీలు జరిగాయి. ఇందులో కెన రాబ్యాంకు, ఎయిమ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బెంగళూరు, స్వర్ణసీమ సుకేత నలు స్పాన్సర్‌గా, స్థానికంగా శ్రీనివాస డిగ్రీ కళాశాల, శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్‌లు లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే పంటలు ఇంటికొచ్చే సమయమని, ముఖ్యంగా ఇంటిల్లిపాదీ సుఖ సంతాలతో జరుపుకునే పండువగా పేర్కొన్నారు. శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ అధినేత శ్రీకాంత్ మాట్లాడుతూ అంతరించిపోతున్న సంప్రదాయాలను కాపాడేందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలు అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమన్నారు. ఇలాంటి సంప్రదాయాలను కొనసాగించేందుకు తనవంతు సహకారం ఉం టుందన్నారు. శ్రీనివాస డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అంతరించిపోతున్న సంప్రదాయాలను కొనగిస్తూ ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముగ్గులపోటీలకు అనూహ్య స్పందన లభిం చిందన్నారు. ఉన్నతపాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన మోహనవళి, ఉషారాణిలు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో సంక్రాంతి పండుగ ముగ్గుల పోటీలకు ఇంతమంది మహి ళలు, భావితరాల యువతులు పాల్గొనడం అభినందనీయమన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వ హించిన ముత్యాల ముగ్గుల పోటీలకు మహిళల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఇందులోభాగంగా పడమటి ప్రాంతాల నుంచి 76మంది ఔత్సాహిక మహిళలు, యువతులు రంగువల్లుల పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో డీవీ పూర్ణ మొదటి బహుమతి, ఎస్.పద్మ రెండో బహుమతి, బి.మల్లిక మూడో బహుమతి కైవసం చేసుకున్నారు. వారికి మొదటి బహుమతి కింద రూ.6వేల విలువ చేసే మిక్సర్ గ్రైండర్, రెండో బహుమతి కింద రూ.4వేల విలువ చేసే ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్, మూడో బహుమతి కింద రూ.3వేల విలువచేసే కుక్కర్ అందజేశారు. ముఖ్య అతిథిగా మదనపల్లె ఆర్డీవో ఎం.ఎస్.మురళి, స్పాన్సర్స్ శ్రీనివాసడిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎన్.శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్‌లు బహుమతులు అందజేశారు. అలాగే తర్వాతి 15 స్థానాల్లో నిలిచిన ఎం.రాజేశ్వరి, వి.రెడ్డిరాణి, ఎ.పద్మ, వై.వనజకుమారి, కె.రెడ్డికుమారి, టి.సరోజ, సి.రమణమ్మ, టి.హేమలత, జి.రేణుక, ఎస్.రెడ్డికుసుమ, జి.సులోచన, బి.భాగ్యలక్ష్మి, ఎస్.హేమలత, టి.గిరిజ, డి.శ్రావణిలకు శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ తరపున ప్రత్యేక బహుమతులు అందజేశారు. దీంతోపాటు ఈ పోటీల్లో పాల్గొన్న 76 మందికి ఇద్దరు స్పాన్సర్స్ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. అలాగే శ్రీవారి సప్లయర్స్ అధినేత ఎన్.బాలగంగాధర్‌రెడ్డి..ఈ ముగ్గుల పోటీలకు తనవంతు సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళి, సతీమణి అరుణ, మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు, యువతులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగించినా... భయపడేది లేదు



అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



అంగన్వాడీ సమ్మెలో పాల్గొన్న జనసేన ఇన్‌చార్జి గంగారపు స్వాతి, శివరాం



వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఎదుట జీవో2 ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు

బి.కొత్తకోట జనవరి 7 : తమపై ఎస్మా ప్రయోగించినా.. పోలీసులతో కొట్టించినా భయపడేది లేదని అంగన్వాడీ లీడర్లు శ్రీవాణి, చాంద్‌బీ, నీలిమా, కుమారిలు పేర్కొన్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు, చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించక పోగా, విధుల్లో చేరక పోతే ఎస్మా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామంటూ బెదిరించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం జీతాలు పెంచక పోగా ఎస్మా ప్రయోగించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం ఎంత వేదించినా వెనక్కు తగ్గేది లేదన్నారు. కార్యక్రమంలో ములకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట మండలాలకు చెందిన కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఉక్కుపాదం మోపితే ఊరుకోం

మదనపల్లె టౌన్, జనవరి 7: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్వాడీలు చేపట్టిన నిరవదిక సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని చూస్తోందని ఇదే జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా అందోళనలు చేస్తామని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ రెడ్డిసాహెబ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. రెడ్డిసాహెబ్ మాటాడుతూ ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. సీఐటీయూ నాయకురాళ్లు మధురవాణి మాట్లాడుతూ నల్ల చట్టాలకు భయపడి వెనక్కి తగ్గమని, తమ డిమాండ్ల సాధన అయ్యేంత వరకు పోరాడుతూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వి.వెంకటరమణ, కార్యదర్శి చలపతి, రాష్ట్ర మైనారిటి ఉపాధ్యక్షుడు ఎస్కే బాషా, మదనపల్లె మండల అధ్యక్షుడు వైసురేంద్రరెడ్డి, ఖాసీమ్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలపై జారీ చేసిన జీవో నెంబర్ 2ను తక్షణమే రద్దు చేయాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. ఆదివారం వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట రహదారిపై జీవో నెంబర్ 2ప్రతులను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీస వేతనాల కోసం శాంతియుతంగా సమ్మె చేస్తుంటే సీఎం జగన్ అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించే ప్రయత్నాలకు పూనుకోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే దాకా సమ్మెను విరమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కార్యక్రమంలోఅంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, ప్రసన్న, అమ్మాజీ, దేవసేన, లక్ష్మీప్రసన్న, రెడ్డిరాణి, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు జనసేన మద్దతు

మదనపల్లె, జనవరి 7: మదనపల్లెలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు జనసేన నేతలు ఆదివారం మద్దతుగా నిలిచారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు సంఘీబావంగా సమ్మెలో పాల్గొన్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గంగారపు స్వాతి మాట్లాడుతూ తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని సమ్మె చేస్తున్న కార్మికులపై ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించడం దారుణమన్నారు. కార్మికులపై చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం ఇప్పటికైనా ఎస్మాను వెనక్కి తీసుకోవాలని చేశారు. మూడు నెలల్లో ఏర్పడనున్న జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం మీ సమస్యలు పరిష్కరిస్తుందని ఆమె..సూచించారు. అనంతరం అంగన్వాడీలతో కలసి స్వాతి ఎస్మా చట్టం ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి జంగాల శివరాం, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, పట్టణ అధ్యక్షుడు జగదీష్, రూరల్ అధ్యక్షుడు బాబు, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, కళ్యాణ్, లోకేష్, నవాజ్, జనార్ధన్, నరేష్, గుజిని,శ్రీనివాసులు, గిరీష్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై ఎస్మా ప్రయోగించడం అన్యాయమని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రభుత్వంపై మండిపడ్డారు. అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 27వ రోజుకు చేరుకుంది. సమ్మెలో బాగంగా ఆదివారం తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు, హెల్పర్లు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో బైఠాయించి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తున్నట్లు ప్రభుత్వం విడుదల చేసిన జీవో కాపీలను తగులబెట్టారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రజలంతా చంద్రబాబే కావాలంటున్నారు

వాల్మీకిపురం, జనవరి 7: రాష్ట్ర ప్రజలంతా సీఎంగా మళ్లీ నారా చంద్రబాబునాయుడు కావాలని కోరుకుంటున్నారని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అయ్యవారిపల్లెలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా గ్రామంలోని ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ అరాచక పరిపాలనతో ప్రజలంతా విసిగిపోయారని రాబోవు ఎన్నికల్లో టీడీపీ, కార్యక్రమంలో వెంకటరమణ, దామోదర్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి, దొరసామిరెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణరెడ్డి, సావిత్రి, నాగరత్న, నాగమణి, నరసమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని చండీ హోమం



చండీహోమంలో పాల్గొన్న దొరస్వామినాయుడు, నల్లారి

మదనపల్లె అర్బన్, జనవరి 7: వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సీఎం కావాలని మదనపల్లెలో రెండో రోజు చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక ఎన్‌వీఆర్ కళ్యాణమండపంలో కట్టా దొరస్వామినాయుడు నిర్వహిస్తున్న మహారాజ శ్యామల చండీహో మంలో ముఖ్యఅతిథిగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ త్వరలో టీడీపీకి మంచిరోజులు సిద్ధిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మండ్లపల్లె రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ బీసీసెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, రాష్ట్ర అధికారప్రతినిధి గుత్తికొండ త్యాగరాజ, పార్లమెంట్ జనరల్ సెక్రటరీ దొరస్వామినాయుడు టీడీపీ సమన్వయకర్త మార్పురి సుధాకర్‌నాయుడు, భవానీప్రసాద్, ఆర్‌జే వెంకటేష్, రాటకొండ మధుబాబు పాల్గొన్నారు.

ఏపీఫిజికల్ సైన్స్ ఫోరం నూతన కార్యవర్గం

మదనపల్లె అర్బన్, జనవరి 7: ఏపీఫిజకల్‌స సైన్స్ ఫోరం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఆంజనేయులు, అధ్య క్షుడిగా ఎం.భాస్కరన్, కార్యదర్శిగా ప్రకాష్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా శాస్త్రి రాష్ట్ర కార్యదర్శులుగా మురళీధర్, భోగవెంకటసుబ్బయ్య, మహిళా కార్యదర్శిగా ఉషారాణి, ఉపాధ్యక్షుడిగా రమేష్‌రెడ్డి, ఉపప్రధాన కార్యదర్శులుగా సుబ్రహ్మణ్యం, జగన్‌మోహన్‌రెడ్డి, డివిజన్ కార్యద ర్శులుగా అఫ్రోజ్, రాజయ్య, రవిప్రతాప్, .రెడ్డిశేఖర్‌రెడ్డి, గౌరవ సలహాదారులను ఎన్నుకున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులు దేశరక్షణకు పాటుపడాలి



ట్రెక్కింగ్ నిర్వహిస్తున్న మిట్స్ విద్యార్థులు

కురబలకోట, జనవరి 7: ఎన్‌సీసీ విద్యార్థులు దేశరక్షణకు పాటుపడాలని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ నవీన్‌కుమార్‌లు పేర్కొన్నారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రముఖపర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని నిర్వహించగా 100మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు. కార్యక్రమంలో శిక్షకుడు నాయుడు, హవల్దార్ ఎ.పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



రామసముద్రం, జనవరి 7: మండలంలోని మట్లవారిపల్లె జడ్పీ హైస్కూల్‌లో 2004-5 సంవత్సరం పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ బ్యాచ్‌కు చెందిన సుమారు 48మంది విద్యార్థులు పాల్గొని ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకుంటూ క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా అప్పటి ఉపాధ్యాయని, ఉపాధ్యాయులను శాలువలతో సన్మానించారు. అనంతరం ఈ పాఠశాల క్రీడాకారులకు పూర్వ విద్యార్థుల తరపున క్రీడా పరికరాలు, క్రీడా దుస్తులు, ల్యాప్‌టాప్ విద్యుత్ చార్జ్‌వైర్లు వితరణ చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సరళకుమారి, ఉమాదేవి, దామోదరం, శ్రీనాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్ , రెడ్డి, అన్సర్‌బాషా, డి.దామోదరం, నరసింహులు, హెచ్ఎం బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం

పెద్దమండ్యం, జనవరి 7: పెద్దమండ్యం మండలంలో కేంద్ర వికసిత్ భారత్ యాత్ర ద్వారా కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని పాపేపల్లి, అవికేనాయక్‌తాండలల్లో ఆదివారం కేంద్ర వికసిత్ భారత్ యాత్రలో భాగంగా ఆయా గ్రామాలలో ప్రజలతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మనోహర్ గౌడ్, బీజేపీ నేత నాగేశ్వర ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్, జడ్పీటీసీ సభ్యురాలు పీరమ్మ, ఎంపీడీవో శ్రీధర్‌రావు,డీటీ గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమగ్రాభివృద్ధే టీడీపీ లక్ష్యం

● జయహో బీసీ రథం ప్రారంభోత్సవంలో నల్లారి కిశోర్



జయహో బీసీ రథయాత్రలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్

మదనపల్లె టౌన్, జనవరి 7: రాష్ట్రంలో బీసీల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా టీడీపీ పనిచేస్తుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో బీసీ విభాగం అధ్యక్షుడు సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో జయహో బీసీ యాత్ర రథాన్ని కిశోర్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు నుంచి చంద్రబాబు వరకు బీసీల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో బీసీలపై దాడులు, దౌర్జన్యాలు అధికమయ్యాయన్నారు. ఇదే బీసీలకు రక్షణగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి తరహాలో బీసీ అట్రాసిటి చట్టం తీసుకొచ్చేందుకు నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారన్నారు. . మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాయచోటి టీడీపీ నాయకుడు మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, పార్లమెంట్ బీసీ విభాగం అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ మాట్లాడుతూ పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో షెడ్యూల్ ప్రకారం ప్రతి మండలంలో జయహో బీసీ యాత్ర రథాలు తిరుగుతాయన్నారు. చంద్రబాబు అధికారంలో బీసీల అభివృద్ధి, వైసీపీ పాలనలో బీసీల అథోగతిపై ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు, పఠాన్ ఖాదర్‌ఖాన్, సర్పంచ్ ప్రభాకర్, బీసీ ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, సాధాకర కమిటీ కన్వీనర్లు వెంకటరమణ, లక్ష్మన్న, జనార్ధన్, రామ్మూర్తి, నారాయణ, దుర్గాప్రసాద్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలు ఐక్యతగా హక్కుల కోసం పోరాడాలి



బస్సుయాత్రలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జనవరి 7: ముస్లిం మైనార్టీలు ఐక్యతగా ఉంటూ వారి హక్కుల కోసం పోరాడాలని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం ముస్లిం ఐక్యవేదిక బస్సుయాత్ర మదనపల్లె పట్టణం బెంగళూరు బస్టాండుకు చేరుకోగా షాజహాన్‌బాషా స్వాగతం పలికి, వారినుద్దేశించి ప్రసంగించారు. దేశంలో ముస్లిం మైనారిటీలు దీనస్థితిలో ఉన్నారన్నారు. రంగనాథ కమిషన్ రిపోర్టు ఆధారాలతో ముస్లీంల తలసరి ఆర్థిక స్థితి రూ.2లక్షల లోపు వుంది. ఎస్సీ, ఎస్టీల కన్నా తలసరి ఆదాయం తగ్గిపోయిందన్నారు. ఇళ్లలో ముగ్గురుంటే కూలీలు, ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారన్నారు. జగన్ అధికారంలోకి వస్తే ముస్లీంలకు మంచి జరుగుతుందని అనుకున్నామని, కాని మరింత దుస్థితిలో ముస్లీంలో మారిపోయారన్నారు. చంద్రబాబు పాలనలో విదేశీ విద్య, షాదిముబారక్, ఇమామ్, మౌజన్లకు చేయూత, విద్యార్థులకు స్కాలర్‌షిప్, రంజాన్ తోఫాలు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ముస్లీం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్‌వలి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌కలాం, సంయుక్త కార్యదర్శి సయ్యద్ నూర్, అధికార ప్రతినిధి సయ్యద్ ఖలీల్, అబ్దుల్ అజీజ్, ఫయాజ్‌బాషా, నజీన్‌బాషా, నాగూర్‌వలి, జక్రియ, మౌలాబేగ్ మెహతాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వాసవీ క్లబ్ సభ్యుల ప్రమాణస్వీకారం



పీలేరు, జనవరి 7: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం ఆదివారం పీలేరులో అట్టహాసంగా జరిగింది. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి డాక్టర్ హెచ్ఎస్ నాగభూషణం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్లబ్స్ గవర్నర్ సోమిశెట్టి సురేశ్ బాబు కార్యవర్గసభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. మదనపల్లెకు చెందిన పులిరాజా ఆనంద్ క్యాబినెట్ సెక్రటరీగా, పీలేరుకు చెందిన ఎం.నగేశ్, పామిడి నాగరాజా వైస్ గవర్నర్స్‌గా, ఆమూరి మహీధర్ క్యాబినెట్ ట్రెజరర్‌గా, రీజియన్ సెక్రటరీగా పామిడి జయచంద్ర, చిత్తూరుకు చెందిన వాణి రమేశ్, పలమనేరుకు చెందిన రమ్య రమేశ్, తిరు పతికి చెందిన తేజ, పశుపర్తి బాలాజీ, నాగేంద్ర ప్రమాణస్వీకారం చేశారు. జోన్ చైర్ పర్సన్స్‌గా జూలూరు అరవింద్, నరేంద్ర, సకల రమేశ్, ఆరూరు రామ్మూర్తి, జిల్లా ఆఫీసర్స్‌గా చిత్తూరు బదరీనాథ్, లక్ష్మీనారాయణ, అనంత మహేశ్, లక్ష్మీపతి, అశోక్, తులసీకృష్ణ, భరత్, హరిప్రసాద్, గణపతి, చెంగయ్య ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే తొగటవీరక్షత్రియులకు రాజ్యాధికారం



మాట్లాడుతున్న శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె అర్బన్, జనవరి 7: ఐక్యతతోనే తొగటవీరక్షత్రియులకు రాజ్యాధికారం దక్కుతుందని తెలుగుయువత రాష్ట్రఅధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, తొగటవీరక్షత్రియ సంఘం రాష్ట్రమహిళా అధ్యక్షురాలు సురపుశ్రీలత అన్నారు. ఆదివారం మల్లయ్యకొండపై తొగటవీరక్షత్రియుల ఆత్మీయ సమావేశంతోపాటు వనభోజన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అంతకుముందు తొగటవీరక్షత్రియసంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. బైక్‌ర్యాలీలో యువత ఉత్సాహంగా పాల్గొంది. ఈ సందర్భంగా తెలుగుయువత రాష్ట్రఅధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మాట్లాడుతూ తొగటకులస్థులు ఐక్యమత్యంతో మెలిగితే రాజ్యాధికారం వస్తుందన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో తొగటలందరు కలిసిమెలసి రాబోవు కాలంలో కార్యాచరణ గురించి చర్చించుకున్నారు. కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ సంఘం మదనపల్లె అధ్యక్షుడు ఉప్పురామచంద్ర, గౌరవాధ్యక్షుడు మోడెం వెంకటరమణ, సెక్రటరీజి. ప్రభాకర్, ట్రెజరర్ లోకేష్, జిల్లా అధ్యక్షుడు వెంకట నారాయణ, ఉపాధ్యక్షుడు రత్నమయ్య, రాష్ట్రప్రధాన కార్యచదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ నార్నవరంవెంకటేష్, కమలమరి కృష్ణ, పురాణం చంద్రశేఖర్, మోడెంసిద్దప్ప బండినాగరాజు, రామిశెట్టి చంద్రయ్య, నీలకంఠ పాల్గొన్నారు.

రైతులు సాంకేతిక వ్యవసాయంపై మక్కువ చూపాలి



మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం

పెద్దతిప్పసముద్రం జనవరి 7 : రైతులు సాంకేతిక వ్యవసాయంపై మక్కువ చూపాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త కొం డా నరేంద్ర పేర్కొన్నారు. పెద్దతిప్పస ముద్రం మండలంలోని మడుమూరు గ్రామంలో ఆదివారం రైతు శిక్షణా శిబి రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు ఏ పంటను పండించినా నష్టాలు వస్తున్న తరుణంలో సాంకేతిక వ్యవసాయం, నూతన పంటల విదానాల గురించి వివరించాలనే ఉద్దేశ్యంతో ప్రముఖ వ్యవసాయ నిపుణులను ఆహ్వానించి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రాజంపేట టీడీపీ పార్లమెంట్ సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వ్యవసాయానికి ఉపాధిహామీతో అనుసంధానం చేయ డానికి ఎంపీగా గెలిచిన వెంటనే పార్లమెంట్‌లో రైతుల పక్షాన పోరాడుతానని చెప్పారు. ఈ సదస్సులో ఆరు మండలాల రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ మీట్ విజేతగా హోత్రిశ్రీ



ట్రోఫీ అందుకుంటున్న హోత్రిశ్రీ

పీలేరు, జనవరి 7: రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2023లో బాడ్మింటన్ విభాగంలో పీలేరుకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణి హోత్రిశ్రీ విజేతగా నిలిచింది. అంగళ్లలోని గోల్డెన్ వ్యాలీ పాలిటెక్నిక్ కళాశాల తరపున టోర్నీలో పాల్గొన్న హోత్రిశ్రీ బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగాలు రెండింటిలోనూ విజేతగా నిలిచి ఆంధ్రప్రదేశ్ తరపున మార్చిలో కర్ణాటక రాష్ట్రంలో జరగనున్న సౌత్ జోన్ పోటీలకు అర్హత సాధించింది. అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ తిరుపతి ఆర్జేడీ నిర్మల్ కుమార్ ప్రియ, అనంతపురం జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంది. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన హోత్రిశ్రీని పీలేరు పట్టణంలోని బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోచ్ ప్రభాకర్ రెడ్డి, క్రీడాకారులు హనీఫ్, గోవర్ధన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రెడ్డిశేఖర రెడ్డి, రెడ్డివారాధి, మునిప్రసాద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కలికిరి జేఎన్టీయూ విద్యార్థికి బంగారు పతకం

కలికిరి, జనవరి 7: కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి జయప్రకాష్‌కు బంగారు పతక ప్రదానం జరిగింది. అనంతపురం జేఎన్టీయూ వర్సిటీ ఆవరణలో శనివారం రాత్రి జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఈ బంగారు పతకాన్ని జయప్రకాష్‌కు అందజేశారు. ఈ కోర్సుకు సంబంధించి యూనివర్సిటీ పరిధిలో అత్యధిక మార్కులు సాధించినందుకుగానూ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. జయప్రకాష్ కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలో ఫుడ్ టెక్నాలజీ కోర్సు చదువు పూర్తి చేశాడు. ఈ సందర్భంగా కలికిరి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు జయప్రకాష్‌ను అభినందించారు.